


THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 7 21.7.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# అధికార, విపక్షాల మధ్య నంబర్లాట

- 26 పార్టీలతో కాంగ్రెస్, 38 పార్టీలతో బీజేపీ
- వీటిలో లోక్‌సభలో ప్రాతినిధ్యం లేని పార్టీలు 35
- ఎన్ని పార్టీలను చేర్చుకున్నా బీజేపీది సొంత పోరాటమే
- ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరో తేల్చుకోలేకపోతున్న కొత్త కూటమి
- ఇరు వర్గాలకీ అక్కరకురాని వైసీపీ, టీడీపీ, బీఆర్ఎస్
- చంద్రబాబు అనుభవాన్ని, జగన్ సామర్థ్యాన్ని, కేసీఆర్ లొల్లిని పట్టించుకోని రెండు బృందాలు

తాజాగా భారత రాజకీయాలలో కొత్త పొత్తులు పొడుస్తున్నాయి. బీజేపీని గద్దె దించాలనే లక్ష్యంతో విపక్షాలు, మరోసారి ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలనే ఆకాంక్షతో బీజేపీ కొత్త స్నేహాలకి చేయందిస్తున్నాయి. బీజేపీ వ్యతిరేక పార్టీల బృందం ఇప్పుడు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇంక్లూజివ్ అలయన్స్(ఇండియా)గా అవతరించింది. 26 పార్టీలతో ఏర్పడిన ఈ కూటమి లక్ష్యం బీజేపీ, వాటి మిత్రపక్షాలని మట్టికరిపించడం. విపక్షాలు తమ కూటమికి కొత్త పేరు ప్రకటించుకున్న నేపథ్యంలో ప్రధాని మోడీ తమ ఎన్డీయే కూటమికి కొత్త నిర్వచనం చెప్పారు. 'న్యూ ఇండియా డెవలప్డ్ నేషన్ ఆస్పిరేషన్ ఆఫ్ పీపుల్ ఆఫ్ ఇండియా' - ఎన్డీయే అని అర్థం మార్చుకున్నారు.

ఈ రెండు మందలు పోటాపోటీగా భేటీ నిర్వహించుకుని ఎన్నికల భేరి మోగించాయి. మంగళవారం విపక్ష కూటమి సమావేశం ముగిసిన తర్వాత పాలకపక్ష కూటమి సిట్టింగ్ జరిగింది. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ 'వారు ఒకరికొకరు సమీపంగా రాగలరు, కానీ, సమైక్యంగా పనిచేయ లేరు' అంటూ వ్యాఖ్యానించారు. అంటే ప్రతిపక్షాల అనైక్యతే బీజేపీ బలం. ఇదే అంశాన్ని

10లో

N.B.K.R. INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
(AUTONOMOUS)
Estd:1979
Affiliated to JNTUA, Ananthapuramu
Vidyanagar, Tirupati Dt. Phone : 8985382247, www.nbkrist.org

OUR CREDENTIALS

EAPCET CODE NBKR

- Courses accredited by NBA under tier - 1
- Accredited by NAAC with 'A' grade
- Accorded 'A' grade by Government of AP
- College with Potential for Excellence
- Robotics Research & Training Center
- ICT ACADEMY Premier Member
- TCS Accredited Institution
- SAEINDIA Collegiate Club
- CYIENT Empaneled Institution
- MEIDEN Japanese Skill Transfer Programme

Courses Offered: B.Tech.
- CSE
- CSE (AI & ML)
- CSE (DS)
- AI & DS
- IT
- ECE
- EEE
- MECHANICAL
- CIVIL

COLLEGE BUS FACILITY FROM
Nellore | Gudur | Naidupeta | Sullurupeta | Tada | Venkatagiri
Muthukuru | Mallam | Podalakuru | Rapuru, Sydapuram & Srikalahasti

- Year-wise separate hostel facility for boys
- Well - protected enclosed hostel for girls

N.C.C.
ARMY WING
NAVAL WING



NEDURUMALLI RAMKUMAR
CORRESPONDENT

## రొట్టెల పండుగలో

# భక్తులకు ఇబ్బందులు ఉండకూడదు

- ఏర్పాట్లు బాగా చెయ్యాలన్న నెల్లూరు ఎంపీ ఆదాల



నెల్లూరులో ప్రపంచవ్యాప్త ఖ్యాతిచెందిన పవిత్రమైన బారా షహీద్ దర్గాలో ఈనెల 29 నుంచి ఆగస్టు 2వ తేది వరకు అయిదు రోజుల పాటు పెద్దఎత్తున రొట్టెల పండుగ జరుగనుంది. రొట్టెల పండుగ వేడుకలకు లక్షలాదిగా భక్తజనం తరలివస్తారు కనుక అందుకు తగ్గట్టుగా భారీ ఏర్పాట్లు చెయ్యాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కలిగించాలని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఇటీవల ఆయన బారాషహీద్ దర్గాలో సమన్వయ కమిటీ సమావేశం పెట్టి ఎలాంటి ఏర్పాట్లు చేయాలో చెప్పారు. ఏర్పాట్ల కోసం నగరపాలక సంస్థ ద్వారా 2.8 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, భక్తులకు వసతులన్నీ చేయాలని ఆదేశించారు. తొలుత ఆయన బారాషహీద్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సమావేశంలో పలువురు మైనార్టీ ప్రముఖులు, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, ఆర్డీఓ మలోలా తదితర అధికారులు పాల్గొన్నారు.

# మెనూ పాటించకపోతే.. క్రిమినల్ కేసులు

## రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ విజయప్రతాప్‌రెడ్డి



పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు అందించే ఆహారపదార్థాలు సక్రమంగా లేకపోయినా, ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు అన్నం పెట్టకపోయినా ఇకనుంచి క్రిమినల్ కేసులు తప్పవంటున్నారు రాష్ట్ర ఫుడ్‌కమిషన్ ఛైర్మెన్ సిహెచ్ విజయప్రతాప్‌రెడ్డి. కాబట్టి ఇకనుంచైనా నిర్వాహకులు జాగ్రత్తగా మెనూ ప్రకారం నడుచుకోవాలి. లేకుంటే కష్టమే. ఇటీవల ఆయన జిల్లాలోని దుత్తలూరులో పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. కొన్నిచోట్ల పాత మెనూనూ అనుసరిస్తుండడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మారిన మెనూను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చదివి వినిపించారు. కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. నాసిరకం అన్నం, కూరలు పెడితే చర్యలు తప్పవని, నాణ్యతలో కూడా రాజీపడేది ఉండదని హెచ్చరించారు.

# అమెరికా వెళ్ళాల్సిన యువకుడిని.. విధి కాటేసింది



ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్ళాలని అన్నీ సిద్ధం చేసుకుని, తిరుమలకు తల్లితండ్రులతో కలిసి సంతోషంగా వెళ్ళి, తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో విధి కాటేసింది. కొండాపురం మండలం ఆదిమూర్తిపురం గ్రామానికి చెందిన నల్లమోతు అరవింద్ (22) ఈ దుర్ఘటనలో అక్కడికక్కడే కన్నుమూయడంతో ఆ తల్లితండ్రుల బాధ వర్ణనాతీతం. పోలీసుల కథనం మేరకు అరవింద్ ఈనెల 19న ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాల్సి ఉంది. తిరుమల నుంచి తల్లితండ్రులు సుమతి-సుబ్బారావుతో కలసి సొంతూరికి రావాలని కలిగిరి దాకా వచ్చారు. ఆ తర్వాత ఆటో ఎక్కి ఆదిమూర్తపురానికి బయలుదేరారు. మార్గమధ్యంలో కుక్క అడ్డం రావడంతో దానిని తప్పించాలని డ్రైవర్ ఆటోను హటాత్తుగా పక్కకు తిప్పడంతో చెట్టుకు ఢీకొనడం, ఆటోలో ఉన్న అరవింద్‌కు తీవ్రగాయాలు తగలడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా, దారిలోనే దుర్మరణం పాలుకావడం జరిగాయి. ఈ ఘటనలో ఆటోలో ఉన్న మరికొంతమందికి గాయాలు తగిలాయి. అరవింద్ గత ఏడాది బీటెక్ పాసై, చెన్నైలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తమ బిడ్డ ఎంతో ఆశగా అమెరికా వెళ్ళాలనుకుని, ఇలా తమ కళ్ళముందే మరణించడంతో ఆ తల్లి తండ్రులు హతాశులైపోయారు. వారిని ఓదార్చడం ఎవరికీ వల్లకాలేదు. అందుకే కాబోలు.. విధి బలీయమైనదంటారు.

# టీచర్లను బదిలీలు చేశారు..జీతాలేవీ?

ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి కానీ, నెలరోజులు దాటుతున్నా వారికి జీతాలు మాత్రం ఇవ్వలేదని, విద్యాశాఖ అధికారులు ఇకనైనా స్పందించి వారికి జీతాలివ్వాలని ఏపీటిఎఫ్ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి కోరారు. ఇటీవల ఆయన వరికుంటపాడు మండలంలోని పలు పాఠశాలలకు వెళ్ళి ఏపిటిఎఫ్ సభ్యత్వ నమోదును ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆయన టీచర్ల సమస్యలపై మాట్లాడుతూ, ప్రభుత్వ సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఉపధ్యాయులకు ఉపయోగంగా ఉండే పాత పెన్షన్ విధానాన్నే అమలుచేయాలని కోరారు. ఆయన వెంట ఏపీటిఎఫ్ నాయకులు డి,బాలకృష్ణ, ఎం.జిలానిబాషా తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానమంటే ఉత్తర శ్రీరంగంగా ప్రసిద్ధి. నెల్లూరు పెన్నానది ఒడ్డున కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి అంటే జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ప్రఖ్యాతిచెందిన పుణ్యక్షేత్రం. స్వామివారికి లక్షలాది మంది భక్తులున్నారు. ఎంతోమంది ప్రముఖులు నిత్యం ఆలయానికి వచ్చి భక్తితో స్వామిని దర్శించుకుని పూజలు చేస్తుంటారు. ఏటా జరిగే రంగడి తిరునాళ్ళ వైభవం చెప్పనలవి కాదు. రంగడి తిరునాళ్లకు ఇసకేస్తే రాలనంత జనం వస్తారు. ఆ స్వామిపై ప్రజలకున్న భక్తి అలాంటిది. కానీ, ఆ దేవస్థానంలో పనిచేసే కొందరు అధికారులు, సిబ్బందికి మాత్రం అవన్నీ లెక్కేలేదు. అసలు దేవుడంటే భయం లేదు, భక్తి అసలే లేదు. ఎంత కాజేసినా ఎవరు చూస్తుంటారులే అని దేవుడి డబ్బును అందినకాడకి దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తుంటారు. అలా ఎంతకాలంగా దేవుడి సొత్తును ఎంత బొక్కేస్తున్నారో లెక్కేలేదు. ఎట్టకేలకు పాపం పండింది. ఇటీవల వారి బండారమంతా బయటపడింది.



# రంగనాథస్వామి డబ్బు...

# కోట్లల్లో తినేశారు

- ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రూ.5.20 కోట్లు బొక్కేశారు
- ప్రతి విభాగంలోనూ భారీస్థాయిలో అవినీతి
- ఎట్టకేలకు ఏసీబీ తనిఖీల్లో బండారం బట్టబయలు

శ్రీ రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న అవినీతి, అవకతవకలపై వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని, నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు ఏసీబీ డిఎస్పీ మోహన్, ఇన్స్‌పెక్టర్ రమేష్, వేణు, కిరణ్, బిఎల్ శ్రీనివాసరావులు తమ బృందాలతో కలసి ఆలయ రికార్డులను పరిశీలించారు. ఈనెల 13 నుంచి ఆలయంలో తిష్టవేసి ఆరురోజుల పాటు ఏకధాటిగా తనిఖీల మీద తనిఖీలు చేశారు. అన్నికోణాల్లో డబ్బు దస్కం, బంగారు వెండి లెక్కలన్నీ బయటకు తీసి, ఎవరెవరి హయాంలో ఎంతెంత మాయం చేశారో ఆరా తీశారు. అన్నీ పరిశీలిస్తే దేవుడి డబ్బును కోట్లల్లోనే తినేసినట్లు వెల్లడైందని సమాచారం. స్వామివారి ఆలయానికి చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల మీద వచ్చే వడ్డీల డబ్బే దాదాపు 5 కోట్ల 20 లక్షల దాకా తినేశారని తెలిసి ఏసీబీ అధికారులే నివ్వెరపోయినట్లు తెలుస్తోంది. అంతేకాదు, బ్రహ్మోత్సవాల పేరుతో టెండర్లు పిలవకుండానే దాదాపు ఏడున్నర లక్షల రూపాయల దాకా మింగేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. దేవుడి డబ్బును, ఆస్తిపాస్తుల్ని కాపాడాల్సినవాళ్ళే కంచే చేనుమేసిన చందంగా ఎవరికి దొరికింది వారు తినేశారు. ఆ పాపం ఊరకేపోతుందా?.. 2009 నుంచి లెక్కలు తీస్తే ఈ లోగుట్టు వ్యవహారమంతా బయటపడింది. ఇప్పటికే బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల లెక్కల్లో తేడాలుండడం, 250 గ్రాముల బంగారం, ఒకటిన్నర కేజీల వెండి మాయం అయినట్లు ఏసీబీ అధికారుల తనిఖీల్లోనే గుర్తించడం జరిగాయి. స్వామి వారి భూముల విషయంలోనూ పెద్ద ఎత్తున మతలబులు జరిగాయని అనుమానిస్తున్నారు. ఇలా ఏళ్ళ తర బడిగా భారీ అవినీతికి పాల్పడుతూ అక్రమార్కులు ఇంకా ఎంత పెద్దమొత్తంలో స్వాహా చేశారో ఆ దేవుడికే తెలియాలి. ఎట్టకేలకు ఏసీబీ అధికారులు తనిఖీలకు దిగడంతో ఈ అవినీతి బాగోతమంతా బయట పడింది. ఏసీబీ వాళ్ళు ప్రతి ఫైలూ తనిఖీ చేసి, సంబంధిత వ్యక్తులను, విరాళాలిచ్చిన భక్తులను అందరినీ ఆరా తీసి ఆ లెక్కలన్నీ బయటకు తీశారు. రంగనాథ స్వామికి భక్తులు సమర్పించే కానుకలు, విరాళాలు, ఉత్సవాల లీజ్‌లు, స్వామివారి బంగారు, వెండి ఆభరణాలు, ఆస్తులు, మడులుమాన్యాలు అన్ని విభాగాల్లోనూ తనిఖీలు చేసి, భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. కోట్లల్లో అవినీతి జరగడంతో, ఈ అవినీతికి ఇంకా ఎందరెందరు పాల్పడ్డారో, ఇంకా ఎవరెవరు ఎంతెంత తిన్నారో, ఈ గోల్మాల్‌కు ఎవరెవరు ఏమేరకు సహకరించారో క్షేత్రస్థాయిలో ఏంజరిగిందో విచారించినట్లు భోగట్టా. ఈ అవినీతికి మూలకారకులెవరో కూడా తెలుసుకునేందుకు అన్నికోణాల్లో పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఏసీబీ అధికారులు ఆ వివరాలన్నిటినీ గోప్యంగానే ఉంచారు తమ తనిఖీలో బయటపడ్డ ఆ విషయాలన్నిటినీ వివరంగా రేపో మాపో ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించనున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాతేం జరుగుతుందోనని అవినీతిపరుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి.

రంగనాథ స్వామి డబ్బునే గాదెకింద పందికొక్కుల్లా తినేస్తున్న ఆ అవినీతి పరుల భరతం పట్టడానికి ఆ దేవుడే ఇంతకాలానికి కళ్ళు తెరిచాడని భక్తజనం సంతోషపడుతున్నారు.

## పురుగుమందుల

# దుకాణాల్లో తనిఖీలు



నెల్లూరు ట్రంకురోడ్డులో ఉన్న పురుగు మందుల దుకాణాల్లో ఇటీవల వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి ఎస్‌వి నాగమోహన్‌లు తనిఖీలు నిర్వహించారు. కొనుగోలుదార్లకు తప్పనిసరిగా రశీదులివ్వాలని, నాశిరకం మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని దుకాణాదారులకు చెప్పారు. దుకాణాల్లో ఏ రకం మందులున్నాయో వాటి వివరాలు, ధరల పట్టికలను ప్రతి షాపు ముందు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు దొరికారు

- లక్షా 50వేల విలువచేసే కాపర్‌వైరు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్ట్



'చోరీలకు కాదేదీ అనర్హం' అన్నట్లుగా తయారైంది నేటి సమాజంలో పరిస్థితి, ఆరుగాలం కష్టించి పంటలు సాగుచేసుకునే రైతులు పంటపొలాలకు విద్యుత్‌కోసం వేలాదిరూపాయలు ఖర్చు పెట్టుకుని ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసుకుంటే కొందరు దుండగులు వాటిపై కూడా కన్నేశారు. జిల్లాలోని ఉలవపాడు మండలంలో 16 ట్రాన్స్‌ఫారమ్‌లు, గుడ్లూరు మండలంలో 4, జలదంకి మండలంలో 3, బోగోలు మండలంలో ఒకటి, వింజమూరులో మరొకటి.. ఇలా ఎక్కడ దొరికితే అక్కడ ట్రాన్స్‌ఫారమ్‌లు దొంగతనంగా ఊడబెరుక్కుని వచ్చి, ఏ మారుమూలనో వాటిని పగలగొట్టి, అందులో ఉన్న కాపర్‌వైరును అమ్ముకుని తింటున్న నిందితులను ఎట్టకేలకు ఉలవపాడు పోలీసులు ఈనెల 15న పట్టుకున్నారు. కావలికి చెందిన ముంగి ఏసుదాసు, పట్టపు వెంకటేశ్వర్లు, పట్టపు వెంకటేష్‌లు ఆటోలో వెళ్ళి ఈ చోరీలు చేసేవారని, దొంగిలించిన వాటిని కావలిలోని తిరుపాలు అనే వ్యక్తికి అమ్మేవారని ఉలవపాడు ఎస్ఐ బాజిరెడ్డి విలేకర్లకు తెలిపారు. నిందితుల వద్ద నుంచి సుమారు లక్షా 50 వేల రూపాయల విలువచేస్తే కాపర్‌వైరు(రాగి తీగ)ను స్వాధీనం చేసుకుని. ట్రాన్స్‌ఫారమ్‌లు దొంగిలించే ఆ ముగ్గురితో పాటు, దొంగసొత్తును కొన్నందుకు తిరుపాలును కూడా అరెస్ట్ చేశామని, కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపరిచామని చెప్పారు.

### జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయంలో..

# కన్నులపండువగా కోటి కుంకుమార్చన

## ప్రత్యేక పూజలు నిర్వహించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం, బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో కొలువై ఉన్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానం వేదమంత్రోచ్ఛరణలతో మార్మోగుతోంది. వందలాదిమంది భక్తులు, ఎంతోమంది ప్రముఖులు నిత్యం అమ్మవారి సేవకు తరలివస్తున్నారు. అక్కడ జరుగుతున్న విశిష్టమైన కోటికుంకుమార్చన పూజలను తిలకించి తరించడానికి భక్తజనం పెద్ద సంఖ్యలో కదలివస్తున్నారు. ఈ నెల 19 నుంచి 29వ తేది వరకు వైభవంగా కోటి కుంకుమార్చన మహాయజ్ఞం ప్రారంభం కావడంతో ఆలయం ప్రత్యేక అలంకారాలతో కళకళలాడుతోంది. ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో కోటికుంకుమార్చన పూజలను ఒక మహాయజ్ఞంలా నిర్వహిస్తున్నారు. శాస్త్రోక్తంగా చేస్తున్న ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా యమునా పూజ, తీర్థసంగ్రహణం, లక్ష్మీగణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, నందీశ్వర పూజ, రుత్విగ్వరణం, దీక్షాధారణ, గోపూజ, వృషభార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర పూజ, శ్రీచక్ర నవావరణ పూజలు తదితర కార్యక్రమాలన్నీ ఏకధాటిగా అత్యద్భుతంగా నిర్వహించారు. టిటిడి ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి–ఢిల్లీ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యులు..ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ పూజాకార్యక్రమాల్లో పాల్గొని గోపూజ చేసి ఆ మహాయజ్ఞాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నూరుగురు రుత్విక్కులు కోటికుంకుమార్చన మహాయజ్ఞాన్ని అద్వితీయంగా నిర్వహిస్తున్నారు. అనంతరం స్వామివారికి–అమ్మవారికి వైభవోపేతంగా కల్యాణోత్సవం కూడా నిర్వహించారు. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులతో కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో ఈ కోటి కుంకుమార్చన పూజలు జరుగుతున్నాయి. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నేతృత్వంలో, ఆలయ పాలకమండలి–అధికారుల సారధ్యంలో, అమ్మవారి భక్తులు.. పలువురు దాతల సహకారంతో 11రోజుల పాటు జరుగనున్న ఈ పూజలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రముఖ దాతలు వల్లూరు రవీంద్రరెడ్డి–కామాక్షమ్మ దంపతులు, కొలను రాజారెడ్డి దంపతులు, పిడూరు శంకర్‌రెడ్డి–స్మిత దంపతులు తదితరులంతా వచ్చి అమ్మవారికి విశేషపూజలు చేస్తున్నారు. ఆలయ పాలకమండలి వారు, అధికారులు ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు.

# 21న వెంకటగిరికొస్తున్న జగన్

## 'వై.ఎస్.ఆర్ నేతన్న నేస్తం' అందజేత

## నేదురుమల్లి జనార్ధనరెడ్డి కాంస్య విగ్రహం ఆవిష్కరణ





ముఖ్యమంత్రి జగన్ నేడు(జులై 21) శుక్రవారం ఉదయం వెంకటగిరికి వస్తున్నారు. తాడేపల్లి నుండి గన్నవరం మీదుగా విమానంలో రేణిగుంటకు చేరుకొని, అక్కడి నుండి సుమారు ఉదయం 10.00 గంటల సమయంలో హెలికాప్టర్ ద్వారా వెంకటగిరి విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకుంటారు. హెలీపాడ్ వద్ద సందర్శకులను కలుసుకున్న అనంతరం "వైఎస్సార్ నేతన్న నేస్తం' కార్యక్రమం జరిగే సభాప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ 5వ విడత 'వైఎస్సార్ నేతన్న నేస్తం' కార్యక్రమంలో నిధులు విడుదల చేసి సభనుద్దేశించి జగన్ ప్రసంగిస్తారు.

సుమారు 12.00 గంటల సమయంలో త్రిభువన్ ప్రాంతానికి చేరుకొని, అక్కడ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం 12.10 నిముషాలకు హెలీపాడ్ వద్దకి చేరుకొని రేణిగుంట నుంచి గన్నవరం మీదుగా తాడేపల్లి చేరుకుంటారు.

తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్‌గా అన్నిటినీ మించి వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా జగన్ వెంకటగిరికి వస్తున్న నేపథ్యంలో సీఎం పర్యటనని ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నారు.




న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఇటీవల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన జరిగిన ఇండియన్ రెడ్‌క్రాస్ సమావేశంలో రాష్ట్ర రెడ్‌క్రాస్ ఛైర్మెన్ శ్రీధర్‌రెడ్డితో పాటు నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రపతి చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్న ఏపీకి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం కూడా ఉన్నారు.

# కరోనా నిధులు తినేశారా?

- కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్న ఆరోపణలు
- పూర్వ వైద్యాధికారి, పలువురు ఉద్యోగులపై విచారణ చేపట్టిన గుంటూరు రీజనల్ డైరెక్టర్



***కరోనా కష్టకాలంలో నెల్లూరులోని పలువురు వైద్యాధికారులు, సిబ్బంది బాగా అక్రమార్జన చేశారని, నిధులను దుర్వినియోగం చేసి అందినకాడకి కాజేశారని గత కొంతకాలంగా జిల్లాలో ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సంబంధిత వైద్యాధికారులపై ఎట్టకేలకు విచారణ ప్రారంభమైంది.***

కోవిడ్ నిధులు మెక్కేయడంతో పాటు, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి, కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్‌ల బదిలీల విషయంలోనూ, డెప్యుటేషన్లు చేయడంలోనూ అప్పటి వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, పలువురు ఉద్యోగులు భారీగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు రావడం, రాష్ట్ర ఉన్నతాధికారులు వాటిని నిగ్గుతేల్చాలని నిర్ణయించడం కూడా జరిగాయి. అయితే, విచారణ మాత్రం ఏ కారణం వల్లనో నెలల తరబడి వాయిదా పడుతూ వచ్చింది. ఒకదశలో ఇక ఈ విచారణ జరగదేమోననే అనుమానాలు కూడా వచ్చాయి. అయితే, ప్రభుత్వం తాజాగా ఆ ఆరోపణలపై విచారణ చేపట్టాలని రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించడంతో ఈనెల 19న వైద్యారోగ్యశాఖ గుంటూరు రీజనల్ డైరెక్టర్(ఆర్‌డి) డాక్టర్ యాస్మిన్ హుటాహుటిన రంగంలోకి దిగారు. అప్పట్లో నెల్లూరులో వైద్యారోగ్యశాఖ అధికారిగా పనిచేసి, ఆ తర్వాత ప్రకాశం జిల్లాకు బదిలీ అయిన డాక్టర్ రాజ్యలక్ష్మిని, అప్పటి కార్యాలయ సూపరింటెండెంట్ మురళి, సీనియర్ అసిస్టెంట్లు రసూల్, భూమా శ్రీనివాసులు, డెప్యూటి డెమో శ్రీనివాసులు తదితర ఉద్యోగులను డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి పిలిపించి విచారణ చేపట్టారు. వారి వద్ద నుంచి లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నారు. 2019 నుంచి 2021 వరకు కేంద్రప్రభుత్వం కోవిడ్ మహమ్మారి నుంచి బాధితులను రక్షించేందుకు అవసరమైన వైద్యసేవలకు సుమారు 10 కోట్ల రూపాయల దాకా విడుదల చేసిందని, ఆ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయన్నది ప్రధానమైన ఆరోపణగా ఉంది. ఈ వ్యవహారంలో భారీఎత్తున అవినీతి జరిగినట్లు కేంద్ర ఆడిట్ బృందం కూడా అనుమానం వ్యక్తం చేసినట్టు భోగట్టా. ఈ ఆరోపణలన్నిటినీ రీజనల్ డైరెక్టర్ క్షేత్రస్థాయిలో అన్ని కోణాల్లో విచారించి వారం రోజుల్లోనే ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు సమాచారం.

ఏదేమైనా.. ఆర్డీ విచారణకు రావడంతో ఏం జరుగుతుందో ఏమోనని డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయవర్గాలు బెంబేలెత్తిపోతున్నాయి.



# బాబోయ్..డెంగ్యూ!

- జిల్లాలో ఇప్పటికే 96 కేసులు
- భయాందోళనలో బాధితులు
- ప్లేట్‌లెట్ల కోసం నానా తిప్పలు

***అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన డెంగ్యూ వ్యాధి జిల్లాలో స్వైర విహారం చేస్తోంది. ఆ వ్యాధి పీడితులు ఆసుపత్రుల్లో నానా యాతనలు పడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ వ్యాధిగ్రస్తులను అత్యవసర వైద్యచికిత్సల పేరుతో పీడిస్తున్నారు.***

జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామ ప్రాంతాల్లో కూడా డెంగ్యూ విజృంభిస్తుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారుల లెక్కలప్రకారం చూసినా తాజాగా జిల్లాలో 96 డెంగ్యూ కేసులున్నాయి. అయితే, అనధికారికంగా ఈ కేసుల సంఖ్య మరింత భారీగానే ఉంటుందని అంచనా. వాతావరణ మార్పుల వల్ల, దోమల వల్ల వర్షాకాలంలో సాధారణంగా ఈ వ్యాధి వస్తుంటుంది. నీటి నిల్వల్లో డెంగ్యూ దోమలు ప్రబలిపోయి ఈ వ్యాధిని వ్యాపింపజేస్తుంటాయి. ప్రాథమికస్థాయిలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే నయం కావడానికి వీలుంటుంది. 'ఎలీసా టెస్ట్' చేయించుకుంటే అది మామూలు జ్వరమా, లేక డెంగ్యూ జ్వరమా అని నిర్ధారణ అవుతుంది. డెంగ్యూ వ్యాధి వచ్చినవారికి రక్తకణాలు తగ్గిపోయి ప్రమాదకర పరిస్థితులు వస్తాయి. రక్తకణాలను వృద్ధి చేసే ప్లేట్‌లెట్స్ అత్యవసరం అవుతాయి. అందుకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేలకు వేలు గుంజుతున్నారని బాధితులు లబోదిబోమంటున్నారు.

### నెల్లూరులో 40కి పైగా కేసులు

పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, మురుగుగుంటలు పెరుగుతుండడం, దోమలకు అవి అవాసాలుగా మారుతుండడం పట్టణాల్లో, నగరంలోనూ మామూలే. 'స్వచ్ఛ నెల్లూరు' అంటారే కానీ, ఆ స్వచ్ఛత అనేది ఎప్పుడో కనుమరుగైపోయింది. నగరంలో పారిశుద్ధ్య పరిస్థితి రోజురోజుకు అధ్వాన్నంగా తయారవుతోంది. ప్రత్యేకించి ఏసీనగర్, బాలాజీ నగర్, సరస్వతినగర్ తదితర ప్రాంతాల్లోనూ, నగర శివారు ప్రాంతాల్లోనూ దోమల రాజ్యమే నడుస్తోంది. ఎంతో కాలంగా ఈ ప్రాంతాలు దోమలకు పుట్టిళ్ళుగా ఉన్నాయి. దోమల నివారణకు కార్పొరేషన్ వారు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. మురుగుకాలువల్లో మందు చల్లడం, వీధులను పరిశుభ్రంగా ఉంచడం, తరచూ ఫాగింగ్ చేస్తుండడం వంటివన్నీ ఇప్పుడు కనిపించడం లేదు. ఫలితంగా ఒక్క నెల్లూరు నగరంలోనే కనీసం 40 దాకా డెంగ్యూ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఒక్క డెంగ్యూ కేసు ఉందని తెలిస్తేనే అధికారులు హడావిడి చేసి, ఆ వ్యాధి నయమయ్యే దాకా చర్యలు తీసుకునేవారు. చికిత్సలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తుండేవారు. ఇప్పుడు అలాంటి స్పందన కలిగిన వైద్యాధి కారులు కానీ, వైద్యులు కానీ లేరు. ఎన్ని కేసులు పెరిగితే అంత లాభం అనుకునే వారే అధికమవుతున్నారు. 'డబ్బుకు లోకం దాసోహం' అన్నట్లుగా తయారైంది పరిస్థితి. చేతిలో బాగా డబ్బులున్న వారు మాత్రం దూరప్రాంతాలకు వెళ్ళి ఉన్నదంతా ఊడ్చిపెట్టి చికిత్సలు చేయించుకుంటుంటే, ఆర్థిక స్తోమతు లేని సామాన్యులు ఆ వ్యాధితో స్థానికంగా ఉండే ఆసుపత్రుల్లోనే ఉన్నంతలో చికిత్సలు పొందుతున్నారు. ప్లేట్‌లెట్ల కోసం నానా తిప్పలు పడుతున్నారు.

ఇకనైనా, ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకుని డెంగ్యూ బాధితులకు సత్వర వైద్యచికిత్సలు చేయించాల్సి ఉంది. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ నుంచి రోగులను రక్షించి, వారికి రాయితీపై తక్కువ ధరకే వైద్యం అందుబాటులోకి తేవాల్సి ఉంది. ఇలాంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ, వారికి ఆ వ్యాధులపై సరైన అవగాహన కల్పించాల్సి ఉంది.

లాయర్
జులై 21, 2023

# వెన్నెల లోకం వైపు.. 'చంద్రయాన్' అడుగులు

మానవలోకానికి చల్లని వెన్నెల వెలుగులు ప్రసాదించే చంద్రుడంటే అందరికీ ఎంతో ఇష్టం. 'చందమామా రావో.. జాబిల్లి రావో' అంటూ చిన్నతనం నుంచి మనమంతా తల్లుల నోట విన్న పాటలు..అందరి మదిలో శాశ్వతంగా నిలిచిపోయే జ్ఞాపకాలు. ఆ చంద్రలోకంలో మనముంటే ఎలా ఉంటుందో అనుకోని వారుండరు. అసలు, చంద్రమండలంలో ఏముంది? అంత వెన్నెల అక్కడినుంచి ఎలా వస్తోంది?..అక్కడ జీవరాశు లేమైనా ఉన్నాయా?.. మనుషులకు ఆవాసం లభిస్తుందా?.. ఇలాంటి ఎన్నోరకాల ప్రశ్నలు అప్పుడప్పుడూ సామాన్యులకు కూడా వస్తుంటాయి. అలాంటి ఆసక్తికరమైన విషయాలకే కాక, చంద్రమండలంలోని రహస్యాలను కూడా శోధించడానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలు 'చంద్రయాన్-3'ను ప్రయోగించారు. అయితే, జాబిలిపై పరిశోధనలంటే అంత సులభమేమీ కాదు. నేల నుంచి నింగి దాకా, అంతరిక్షం నుంచి చంద్రుని దాకా వెళ్లాలంటే మాటలు కాదు. మొత్తంగా దాదాపు 3 లక్షలా 84వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం. శ్రీహరికోటలోని షార్ రాకెట్ కేంద్రం నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు తమకెంతో నమ్మకమైన బాహుబలిగా పేరొందిన 'ఎల్‌విఎం-3-ఎం4' రాకెట్ చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని అవలీలగా మోసుకువెళ్ళి నిర్దేశిత కక్ష్యలో వదిలి పెట్టడం ఒక అద్భుతం. ఆ చరిత్రాత్మక ప్రయోగం జయప్రదం కావడంతో శాస్త్రవేత్తలు, ప్రజల ఆనందానికి అవధులే లేవు. ఇస్రో అమ్ములపొదిలోంచి వదిలిన రామబాణంలా మన చంద్రయాన్ రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి శరవేగంగా దూసుకుపోవడాన్ని నేరుగాను, ప్రసారమాధ్యమాల్లోనూ వీక్షించిన ప్రజల మనసుల్లో ఏదో తెలియని పులకింత. ఇంతకాలంగా కలల్లోనే ఉన్న ఆ వెండి వెన్నెల లోకంలోకి మన రాకెట్ అడుగుపెట్టనుందనే ఊహే అందరినీ పరవశింపజేసింది. జులై 14న అంతరిక్షంలోకి వెళ్లిన 'చంద్రయాన్', ఈ నెల 18వ తేదీ నాటికి సురక్షితంగా ప్రయాణం సాగిస్తోంది. మూడోదశలో చేయాల్సిన కక్ష్య పెంపును కూడా శాస్త్రవేత్తలు విజయవంతంగా చేశారు. 24 రోజులపాటు భూకక్ష్యలో తిరుగుతూ, అనంతరం చంద్రుని కక్ష్యలోకి ప్రవేశిస్తుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, ఆగస్టు 23వ తేదీన జాబిలి ఉపరితలంపై చంద్రయాన్-3లోని ల్యాండర్ అత్యంత సురక్షితంగా అడుగుపెడుతుంది. దాంతో భారత్ ఖ్యాతి విశ్వవ్యాప్తంగా జగజ్జగీయమానం అవుతుంది. సరిగ్గా..ఆ రోజు కోసం..ఏళ్ళనాటి కల సాకారం కోసం దేశంలోని శాస్త్రవేత్తలు, ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. అందులోనూ ప్రపంచంలో ఇంతవరకు ఎవరూ వెళ్ళడానికి ప్రయత్నించని అత్యంత క్లిష్టమైన చంద్రుని దక్షిణ ధ్రువం మీదికి మన ల్యాండర్ దిగి పరిశోధనలు చేయడమన్నది ఎవరూ చేయని అద్భుతం. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యా, చైనాల తర్వాత, పూర్తిస్వదేశీ పరిజ్ఞానంతో మన శాస్త్రవేత్తలు చంద్రయాన్‌ను రూపొందించడం గర్వకారణం. ఇప్పటికే 'చంద్రయాన్-1' ద్వారా చేసిన యాత్రలో చంద్రమండలంపై హిమరూపంలో నీళ్ళు గడ్డకట్టి ఉన్నాయని మొట్టమొదటిసారిగా ప్రపంచానికి తెలియజేసింది కూడా ఇస్రో శాస్త్రవేత్తలే. చంద్రయాన్-2 ఒక దశలో ఆటుపోట్లకు గురై నిరాశపరచినా, ఆ పొరపాట్లు సరిదిద్దుకుని బయలుదేరిన చంద్రయాన్-3 యాత్ర ఇప్పుడు తప్పకుండా దిగ్విజయం అవుతుందని అందరూ ఆకాంక్షిస్తున్నారు. ఇప్పటికే తనదైన శైలితో అద్భుతాలు సృష్టిస్తోంది ఇస్రో. విదేశాలకు చెందిన అనేక ఉపగ్రహాలను మన రాకెట్‌ల ద్వారా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెడుతూ రోదశిలో తన సత్తా చాటుతోంది. ఈనెల 26న కూడా షార్ నుంచి పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్ నింగిలోకి దూసుకుపోయేందుకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో, చందమామపై పరిశోధనలకు కూడా ఉపక్రమించడం విశేషం. చంద్రమండలంలో హీలియం, టైటానియం, థోరియం వంటి అమూల్యమైన ఖనిజ నిక్షేపాలకు కొదవలేదు. వాటి గుట్టుమట్లు తెలుసుకుంటే సమస్త మానవాళికి మాటల్లో చెప్పలేనంత ఉపయోగం ఉంటుంది. అంతేకాదు, చంద్రునిపై రహస్యాలను తెలుసుకోగలిగితే అనేక గ్రహాల ఉనికిని కూడా తెలుసుకునేందుకు, తద్వారా విశ్వం పుట్టుక పరిణామల గురించి ఎంతోకాలంగా ఉన్న అనేకరకాల సందేహాల నివృత్తికి కూడా వీలవుతుంది.

ఏదేమైనా... ఇస్రో సాహసయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిద్దాం. 'చంద్రయాన్' దిగ్విజయం అవుతుందని.. ఇంతకాలంగా అందని ఆ అందాల చందమామను అందుకుంటూ 'చంద్రయాన్' యాత్ర పూర్తిస్థాయిలో ఫలిస్తుందని ఆశిద్దాం!....

# లంచం రాజకీయాలు

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

– యెన్నికల్లో డబ్బుల్ని, ఉచిత బహుమతుల్ని దీస్కొనేటోళ్లలో, గృహ సముదాయ (అపార్ట్‌మెంట్ల) భవనాల్లో ఉండే వ్యాపారస్తులు, మధ్యతరగతి, పై మధ్యతరగతోళ్ళు, ఉద్యోగులు, 'గురుదేవులు', భగవద్భక్తులుండడం సిగ్గుచేటు. నడీధిలో నగ్నస్నానమంత ఘోరం. ఇంతకన్నా సిగ్గిడ్సిన్తనం ఇంకేముంటది?..

– దేశంలో రాజకీయ నాయకులు జాస్తి. రాజనీతిజ్ఞులు మహా అరుదు. అందువల్లే యెన్నికల్లో లంచం రాజకీయాలు వీరవిహారం జేస్తుండాయి. అందిన 'లంచం సారాయి'ని దాగతారు. అది కల్తీదైతే పాడెమీదిగెక్కతారు. లంచం డబ్బుతో సారాయిని కొనిగూడా దాగతారు. అప్పుడ్కె చెడిన ఆరోగ్యాన్ని యింకొంత చెడగొట్టు'కొంటారు'. సారాయలవాట్లేనోళ్ళు, రాజకీయ రక్కసిమూకల 'పుణ్యాన' కొత్తగ అలావాట్జేస్కొంటారు. లేదా దాన్నమ్ముకొని, డబ్బుజేస్కొంటారు. లంచం డబ్బులు, సారాయినమ్మిన డబ్బుల్తో జూదమాడ్తారు, రంకు జేస్తారు, కట్టుకొన్న మన్షికి రోగాలంటిస్తారు. యింకేమో పాడుపన్లు జేస్తారు. తేరగొచ్చిన డబ్బైపాయ. యీ భావదరిద్ర్యాన్కంతా గార్ధం, భ్రష్టుబట్టిన రాజకీయం. అదే యిప్పుడు దేశమంతా దిగంబరంగా గంతులేస్తా ఉండాది.

**– తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, 'ఓ-', నెల్లూరు.**

# వాగులు వంకలు కూడా కబ్జా చేసేస్తున్నారు

జిల్లాలోని అనేకప్రాంతాల్లో వాగులు, వంకలు, కాలువల పక్కనున్న స్థలాలను కూడా అక్రమార్కులు కబ్జా చేసేస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమించుకోవడమే. అవి ప్రభుత్వ స్థలాలైనా వాళ్ళు లక్ష్య పెట్టడం లేదు. దీంతో ఆ కాలువలు, లేదా వాగులు కుంచించుకుపోతున్నాయి. వర్షాలు భారీగా వచ్చి, ప్రవాహాలు ఎక్కువైనప్పుడు ఆ నీళ్ళన్నీ ఆ పరిసరాల్లో ఉన్న ఇళ్ళ మీద, ఊళ్ళమీద పడుతున్నాయి. పేదలు కట్టుకున్న కాలనీల్లోకి వరదనీరొచ్చి నానా ఇబ్బందుల పాలుచేస్తున్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు కానీ, జిల్లా ఉన్నతాధికారులు కానీ ఈ కబ్జాలను పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇదే సందని అందిన స్థలాలన్నీ ఆక్రమించేసుకుంటున్నారు. అక్కడ వాళ్ళేవో కట్టడాలు కట్టేస్తే, ఇక వాటిని ఖాళీ చేయించడం అన్నది దుర్లభం. జిల్లావ్యాప్తంగా వీటిపై సర్వే జరగాలి. వాగులు, వంకలు, చెరువులు, పెద్దపెద్ద కాలువల పక్కన ఎంత స్థలం ఉండాలి?..ఇప్పుడెంత ఉంది? ఎవరైనా ఆ స్థలాలను అక్రమించుకున్నారా?..అనే విషయాలపై పూర్తిస్థాయిలో సర్వే జరిపించి ఆ స్థలాలను ప్రభుత్వం పరిరక్షించాలి. ప్రభుత్వ స్థలాల వద్ద 'ఇవి ప్రభుత్వ భూములు' అనే విషయాన్ని బోర్డులు ద్వారా సూచించాలి. ఎంతోకాలంగా జరుగుతున్న ఈ అక్రమాలకు ఎప్పటికి అడ్డుపడుతుందోనని ఆయా గ్రామీణప్రాంతాల్లో ప్రజలు ఎదురుచూస్తూనే ఉన్నారు. జిల్లా కలెక్టర్, లేదా సంబంధిత ఉన్నతాధికారులు కొరడా పట్టుకుంటే తప్ప ఈ కబ్జాలు ఆగవు.

**ఎస్.కె శాంతయ్య, బోగోలు.**

# సంచార జాతులకు రిజర్వేషన్ ఇవ్వాలి

## - రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మెన్ వీరన్న



సంచార జాతుల వారికి కేంద్రప్రభుత్వం 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మెన్ పెంద్ర వీరన్న కోరారు. ఈనెల 18న ఆయన నెల్లూరులోని అంబేద్కర్‌నగర్‌లో తోలుబొమ్మలాట కులసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంచారజాతుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో ఎంతో ప్రాచీనమైన తోలుబొమ్మలాట కళకు ఆదరణ కరువైందని, ఆ కళాకారులకు మండల కార్యాలయాల్లో ఇప్పుడు కులధ్రువీకరణ పత్రాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎందరో నిరుపేద కళకారుల బిడ్డలు విద్యకు దూరమవుతున్నారన్నారు. సంచారజాతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వం ఇచ్చిన జిఓ నంబరు 8 ప్రకారం 32 సంచార జాతుల ఉప కులాలకు బీసీ–బీ జాబితాలో చేర్చడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, మూలే విజయభాస్కర్ రెడ్డి, మొయిళ్ళ సురేష్‌రెడ్డి, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు సిహెచ్ రవికుమార్, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం, సంచారజాతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నపరెడ్డి శేఖర్, జిల్లా అధ్యక్షుడు ఎస్. చినకొండయ్య, తోలుబొమ్మలాట సంఘం జిల్లా అధ్యక్షుడు బిందె శివ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ ధర్నా

విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ళయినా విద్యారంగానికి సంబంధించిన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఈనెల 18న విద్యార్థులు నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. విద్యార్థుల కోసం కోట్లు ఖర్చుచేస్తున్నట్లు సిఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించుకుంటున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ చార్జీలను చెల్లించాలని, హాస్టళ్ళలో మంచినీటి వసతి కోసం ఆర్‌ఓ ప్లాంట్‌లు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. బాలికల హాస్టళ్ల వద్ద ఆకతాయిల ఆగడాలను నివారించేందుకు సిసి కెమెరాలు పెట్టాలన్నారు. అనంతరం డిఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కిషోర్, విద్యార్థి నాయకులు దినేష్‌కుమార్, శివం వర్మ, వరుణ్, స్వరూప్, జీవన్‌సాయి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# 'డైట్'లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులోని ప్రభుత్వ డైట్ ఆవరణంలో 1992–93 విద్యాసంవత్సరంలో టి.టి.సి చదివిన విద్యార్థులు ఈనెల 16న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఆత్మీయ స్నేహాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. కార్యక్రమ నిర్వాహకులు గుండాల నరేంద్రబాబు, కృష్ణయ్య, సుబ్బారావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం తమకెంతో అపురూపమైనదన్నారు. డైట్లో అప్పట్లో శిక్షణ పొందిన సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకకు అవకాశం కల్పించిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత, దివంగతులైన అధ్యాపకులు, విద్యార్థుల చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థుల ప్రతినిధులు మల్లికార్జున, శివప్రసాద్, నారాయణ, పూర్వ అధ్యాపకులు శ్రీనివాసరావు, పి.యల్.రావు, జ్ఞానోత్తమ్, జిలానీబాషా, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, సరోజిని, నర్సింహారెడ్డి, పూర్వ ప్రిన్సిపాల్ కుమారుడు పి.శ్రీధర్‌బాబు, ప్రస్తుత డైట్ ఉపన్యాసకులు డి.నర్సింగరావు, కె.విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మహిళపై దౌర్జన్యం

చేజర్ల మండలానికి చెందిన చల్లా రాజమ్మ ఈనెల 17వ తేది వావిలేరు నుంచి పశువులను ఇంటికి తోలుకెళుతుండగా ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి దౌర్జన్యం చేసి ఆమె మెడలోని రెండున్నర సవర్ల బంగారు సరుడును లాక్కుపోయారు. చేజర్ల పోలీసులు ఆ దుండగులను పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు.

## అంతర్జాతీయ 'ఆర్చరీ'లో..

# అదరగొట్టిన నెల్లూరు చిన్నోడు

### కొలంబోలో బంగారు-వెండి పతకాలు సాధించాడు




'ఆర్చరీ' (విలువిద్య)లో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో నెల్లూరు చిన్నోడు తన సత్తా చాటాడు. ఈనెల 15, 16 తేదీల్లో శ్రీలంకలోని కొలంబోలో జరిగిన ఆర్చరీ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారుపతకం సాధించి నెల్లూరు కీర్తిని దశదిశలా చాటాడు. నెల్లూరు మూలాపేటలో ఉన్న లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చాట్ల అక్షయ్ మహదేవ్ అరుదైన ఈ ఘనతను సాధించడం అభినందనీయం. కొలంబోలోని మహిందా రాజపక్స స్టేడియంలో అక్షయ్ పేరు, నెల్లూరు పేరు మార్మోగిపోయాయి. అండర్-12 రికర్వు విభాగంలో 18 మీటర్ల పోటీలో అక్షయ్ ప్రథమస్థానం సాధించి, స్వర్ణపతకం అందుకోవడమే కాక, 30 మీటర్ల రికర్వు ఓపెన్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి వెండిపతకం కూడా సాధించడం విశేషం. మన రాష్ట్రం నుంచి ఈ పోటీలకు ఆరుగురు ఎంపికైనా అక్షయ్ అద్వితీయ ప్రతిభతో రాణించి పతకాలు కైవసం చేసుకున్నాడు. ఈ పోటీల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా వచ్చిన 124మంది విలువిద్య క్రీడాకారులు ఒకేసారి 30వేల విల్లులు ప్రయోగించి ప్రపంచరికార్డు సృష్టించారు. ఆ విభాగంలో కూడా అక్షయ్ పాల్గొని సర్టిఫికెట్‌ను అందుకున్నాడు.

# వేధింపులు ఆపండి.. సమస్యలు తీర్చండి

## నగరంలో పెద్దఎత్తున ఆశా వర్కర్ల ధర్నా




నెల్లూరు నగరంలోని డిఎం అండ్ హెచ్ఓ ఆఫీసు వద్ద ఈనెల 18న ఆశా వర్కర్లు భారీఎత్తున ఆందోళన చేపట్టారు. 26 రకాల రికార్డులు రాయాలంటూ తమపై లేనిపోని పనివత్తిడి పెంచి వేధిస్తున్నారని, ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు తీర్చాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్లకు మెడికల్ లీవులు, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలన్నారు. పీహెచ్‌సీలకు పిలిపించినప్పుడు పల్లెప్రాంతాల్లో నెట్‌వర్క్ పనిచేయక పోయినా అందుకు కూడా ఆశావర్కర్లనే బాధ్యులను చేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి ప్రశ్నించారు. అనంతరం ఏఓ రాంగోపాల్‌కు తమ డిమాండ్ల వినతిపత్రం సమర్పించారు.

# రైతుబజార్లలో..కందిపప్పు, బియ్యం

పెరిగిన నిత్యావసర ధరల భారాన్ని ప్రజలపై తగ్గించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్లలో కందిపప్పు, బియ్యం రిటైల్ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈనెల 16న ఆయన నెల్లూరు నగరంలోని నవాబుపేట రైతుబజార్లో ఏర్పాటుచేసిన రిటైల్ అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నెల్లూరులోని నవాబుపేట, ఫత్తేఖాన్‌పేట రైతు బజార్లలో, కావలి, కందుకూరుల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని, మరో 6 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. సబ్సిడీ రిటైల్ కౌంటర్ల ద్వారా బహిరంగ మార్కెట్ కంటే తక్కువగా 48 రూపాయలకే నాణ్యమైన బియ్యం, రూ.137కే కందిపప్పు అందజేస్తున్నామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనిత, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో.. యువ ఉత్సవ్

నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక టౌన్‌హాల్లో జిల్లాస్థాయి యువ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించారు. యువతకు దేశం పట్ల ఉండాల్సిన కర్తవ్య భావం గురించి వివరిస్తూ, దేశ అభివృద్ధికి యువత ఏ రకంగా సహకరించాలనే అంశాలను వక్తలు ఈ సందర్భంగా వివరించారు. ఈ యువ ఉత్సవంలో భాగంగా యువతకు వక్తృత్వ పోటీలు, గేయ రచన, మొబైల్ ఫోటోగ్రఫీ, పెయింటింగ్, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పరవస్తు సాయిసూరి, డిస్ట్రిక్ ఎన్‌ఐసి ఆఫీసర్ సురేష్‌బాబు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ శంకర్, నాబార్డ్ డిడిఎం రవిసింగ్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ఏ.మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## • నింగిలోకి చంద్రయాన్-3

# ప్రయోగం జయప్రదం.. సవ్యంగా ప్రయాణం

అందరూ ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న చంద్రయాన్ రాకెట్ ప్రయోగం జయప్రదంగా జరిగింది. జులై 14వతేదీ మధ్యాహ్నం సరిగ్గా 2.45 గంటలకు రాకెట్‌ను ప్రయోగించారు. 640 టన్నుల బరువు, 43.43 అడుగుల పొడవున్న ఎల్‌విఎం3-ఎం4 బాహుబలి రాకెట్, 3920 కిలోల బరువున్న చంద్రయాన్-3 మిషన్‌ను అవలీలగా మోసుకువెళ్ళి నిర్దేశిత కక్ష్యలోకి విడిచిపెట్టడంతో ఈ ప్రయోగం విజయవంతమైంది. చంద్రుని వైపు ప్రయాణం కూడా సవ్యంగా సాగుతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తల నిర్విరామ కృషి ఇది. ముచ్చటగా మూడోసారి చంద్రయాన్ రాకెట్ నింగిలోకి దూసుకుపోయింది. శ్రీహరికోటలోని షార్‌లో ఉన్న రెండవ ప్రయోగవేదికపై నుంచి ఈ ప్రయోగం జరిగింది. మూడు దశల్లో సాగే ఎల్‌వి ఎం3-ఎం4 రాకెట్ చంద్రయాన్ మిషన్‌ను 16.09 నిమిషాల వ్యవధిలోనే రోదసిలోకి చేర్చి, నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశ పెట్టడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో ఆనందం మిన్నంటింది. ఈ ప్రయోగ కార్యక్రమాన్నంతా కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రధాని కార్యాలయ ప్రతినిధి జితేంద్రసింగ్ స్వయంగా షార్ నుంచి వీక్షించారు. ప్రయోగం విజయవంతం కావడంతో ఇక చంద్రునిపైకి జరిగే ప్రయాణమే అందరికీ ఉత్కంఠగా ఉంది. చంద్రయాన్-3 మిషన్ 41 రోజులపాటు రోదసిలో ప్రయాణించి ఆగస్టు 23 సాయంత్రం 5.47 గంటలకు చంద్రుని ఉపరితలంపై దిగుతుంది. అంతవరకూ ఉత్కంఠ తప్పదు. చంద్రునిపై ల్యాండర్ దిగిన వెంటనే ల్యాండర్ నుంచి రోవర్ దిగి చంద్రునిపై పరిశోధన ప్రారంభిస్తుంది. భారత్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, చరిత్రాత్మకమైన ఈ యాత్ర దిగ్విజయం కావాలని అందరి ఆకాంక్ష.

## 26న.. పిఎస్ఎల్‌వి-సి56 ప్రయోగానికి రెడీ

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. 3వ దశ కక్ష్య పెంపు ఆపరేషన్‌ను కూడా ఇస్రో శాస్త్రవేత్తలు జయప్రదంగా పూర్తిచేయడతో చంద్రయాన్ రాకెట్ ఇక త్వరలోనే చంద్రునివైపుకు విజయవంతంగా దూసుకుపోయేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, షార్ నుంచి ఈనెల 26 పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సమాయత్తమయ్యారు. వాణిజ్య ప్రయోజనం కోసం ఈ రాకెట్ ప్రయోగం జరగనుంది. ఈ రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన 361.9 కిలోల బరువైన డిఎస్-ఎస్‌ఏఆర్ అనే భూపరిశీలన ఉపగ్రహంతో పాటు, మరో ఆరు చిన్న ఉపగ్రహాలను కూడా నింగిలోకి పంపనున్నారు. షార్‌లోని రెండవ ప్రయోగ వేదికపైనుంచి ఈ రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

# పోయిన ఫోన్లను వెతికిపెడుతున్న.. 'మొబైల్ హంట్'

- రూ. 65 లక్షల విలువచేసే 270 ఫోన్లు రికవరీ
- పోలీసుల సేవలు భేష్ అంటున్న ఫోన్ల సొంతదారులు



జిల్లాలో ఎవరైనా, ఏ కారణం వల్లనైనా ఫోన్ పోగొట్టుకుంటే.. ఇక దొరికేది కల్ల అనుకునేవారు కొద్దికాలం క్రితం. ఇప్పుడా పరిస్థితి పోయింది. ఆ సెల్‌ఫోన్ ఎక్కడుందో కనిపెట్టి దానిని తిరిగి సొంతదారులకు అందించడంలో నెల్లూరుజిల్లా పోలీసులు చేస్తున్న కృషి ప్రజల ప్రశంసలందుకుంటోంది. పోయిన ఫోన్లు ఎక్కడున్నాయో తెలుసుకునేందుకు జిల్లా పోలీసు శాఖ ఒక ప్రత్యేక వాట్సాప్ నంబరును (91543 05600) కేటాయించింది. సెల్ ఫోన్ ఎవరైనా పోగొట్టుకుంటే ఆ వాట్సాప్ నంబరుకు ఆ వివరాలు తెలియజేస్తే చాలు.. ఇక మొబైల్ హంట్ ఆ ఫోన్ ఎక్కడుందో కనిపెట్టడానికి రంగంలోకి దిగుతుంది. అలా ఇప్పటికి, అంటే ఈనెల 17వ తేదీ నాటికి దాదాపు 270 సెల్ ఫోన్లను రికవరీ చేశామని, వాటి విలువ దాదాపు 65 లక్షల రూపాయల దాకా ఉంటుందని జిల్లా ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితులకు వాటిని అందజేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్ హంట్ మంచి ఫలితాలిస్తోందని, ఇప్పటిదాకా మూడు విడతల్లో సుమారు 1.61 కోట్ల రూపాయల విలువచేసే 604 సెల్‌ఫోన్లను సొంతదారులకు అందజేశామని ఆయన తెలిపారు. ఫోన్ చోరీకి గురైనా, లేదా పోగొట్టుకున్నా బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళనవసరం లేకుండా ఆ వాట్సాప్ నంబరుకు మెసేజ్ ఇస్తే, సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం ద్వారా అతి తక్కువ కాలంలోనే ఆ ఫోన్ ఎక్కడుందో గుర్తించి, దానిని రికవరీ చేసి బాధితులకు అంద జేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని బాధితులు ఉపయోగించుకోవాలని కోరారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఐఆర్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేసినా పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి బాధితు లకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పోయిన ఫోన్లను తక్కువకాలంలోనే రికవరీ చేస్తున్న సైబర్ పోలీసుల బృందాన్ని ఎస్పీ అభినందించారు.

# పెరుగుతున్న ధరలపై టీడీపీ నిరసన



నానాటికీ ధరలు పెరుగుతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని, నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్‌సిలిండర్, చివరికి కూరగాయల ధరలు కూడా విపరీతంగా ఉన్నాయని, వైకాపా ప్రభుత్వం ప్రజల అవస్థలు పట్టించుకోవడం లేదని నిరసన తెలుపుతూ నెల్లూరులో టీడీపీ ఆధ్వర్యంలో ఈనెల 17న పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. కూరగాయల దండలు మెడలో వేసుకుని, నెత్తిన గ్యాస్‌బండ మోసుకుని, 'ఏం తినేటట్టులేదు.. ఏం కొనేటట్టు లేదు' అంటూ పెద్ద ఎత్తున ధరల బాదుడుపై నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ఇలాంటి సమస్యలన్నీపోయి, ప్రజలు బాగుపడాలంటే తెదేపా అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమన్నారు. 26వ డివిజన్ టీడీపీ ఇన్‌ఛార్జి గాలాజు శివాచారి, రవి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు



## చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'.. రూ.19.08 కోట్లు

'జగనన్న తోడు' పథకం 7వ విడత కింద జిల్లాలోని 19.085 మంది చిరువ్యాపారులకు మొత్తంగా 19.08 కోట్ల రూపాయలను అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌తో కలిసి ఆయన ఈనెల 18న నెల్లూరు కలెక్టరేట్‌లో ఆ పథకం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. పేదలు వడ్డీవ్యాపారుల బారినపడకుండా ప్రభుత్వం వారికి వడ్డీలేని రుణాలు అందిస్తోందని, రుణాలు సక్రమంగా తిరిగి చెల్లించినవారికి ప్రభుత్వమే ఆ వడ్డీని వారి ఖాతాల్లో జమ చేస్తోందని చెప్పారు. ఆమేరకు 76.36 లక్షల రూపాయల వడ్డీ చెక్కును కూడా కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌లో సర్టిఫికెట్ల ప్రదానం



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, సెయింట్ జాన్స్ అంబులెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ (ప్రథమ చికిత్స)లో శిక్షణ పొందిన వారికి సెయింట్ జాన్ అంబులెన్స్-న్యూఢిల్లీ వారి నుండి ప్రొవిజినల్ సర్టిఫికెట్స్‌ను ఇటీవల అందజేశారు. నెల్లూరులోని రెడ్ క్రాస్ జిల్లాశాఖ ఛైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సూచన మేరకు రెడ్ క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ వాటిని అందజేశారు ఈ కార్యక్రమంలో సెక్రెటరీ పి.మస్తానయ్య, సీనియర్ స్టేట్ కోఆర్డినేటర్ జి.వి.రవికుమార్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష.. ఎంతో ఉపయోగం



'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని' విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇటీవల నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ రామకృష్ణానగర్, వాటర్‌ట్యాంక్ పార్క్ దగ్గర జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి ఆయన పాల్గొని, కార్యాలయాల చుట్టూ తిరగకుండా అవసరమైన అన్ని సర్టిఫికెట్లను పొందేందుకు 'జగనన్న సురక్ష' ఉపకరిస్తుందన్నారు. వైకాపా నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు రావు శ్రీనివాసరావు(ఆర్.ఎస్.ఆర్), నాయకులు తాళ్లూరు సురేష్, గోపాల్‌రెడ్డి, రామ్మోహన్ యాదవ్, రాజా, రూపేష్, వాసంతిరెడ్డి, ప్రసన్నలక్ష్మి, కార్పొరేటర్లు విజయభాస్కరరెడ్డి, ఒరిస్సా శ్రీనివాసులు, షేక్ సత్తార్, నూనె మల్లికార్జునయాదవ్, మొయిళ్ళ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్‌గా డా.నాగమణి



పశుసంవర్ధక శాఖ నెల్లూరు డివిజన్ డెప్యూటీ డైరెక్టర్‌గా డాక్టర్ ఎం.నాగమణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వైఎస్సార్ జిల్లా ఖాజీపేటలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న ఆమెను పదోన్నతిపై నెల్లూరులో డీడీగా నియమించారు. ఈనెల 18న ఆమె నెల్లూరులోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పలువురు అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



## ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు

### - సొంతనిధులతో అందజేసిన ఎంపీ ఆదాల -

నెల్లూరు ఎంపీ ఆదాల నెల్లూరులోని ట్రాఫిక్ పోలీసులకు ఇటీవల సుమారు 10 నుంచి 12 వేల రూపాయల వరకు విలువ చేసే ఏసీ హెల్మెట్లను తన సొంతనిధులతో కొనుగోలు చేసి, స్వయంగా వాటిని జిల్లా ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ, ఎర్రటి ఎండలో రోజంతా పోలీసులు పనిచేస్తుంటారని, పోలీస్ శాఖకు ఎప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. నెల్లూరు పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో 30 మంది ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లను అందజేశారు. తన స్నేహితుడి ద్వారా వీటిని తెప్పించానని, వాటిని వాడిన తర్వాత బాగోగులు తెలుసుకొని మిగతా వారికి కూడా అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డితో పాటు విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్థివదేహాలు తీసుకువెళ్లేందుకు.. ఉచిత వాహనం



కులమతాలకు అతీతంగా పార్థివదేహాలను తీసుకు వెళ్లేందుకు ఉచిత వాహన సదుపాయాన్ని కలిగిస్తోంది నెల్లూరులోని మొలకలపల్లి జాషువా రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్. తమ తల్లితండ్రులు జాషువా రాజారత్నం, రమ జ్ఞాపకార్థం ఈ వాహన సదుపాయాన్ని దర్గామిట్టలోని సాల్వేషన్ ఆర్మీ కార్యాలయంలో ఏర్పాటు చేశామని ట్రస్ట్ నిర్వాహకులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు జీఎం, మన నెల్లూరీయుడు మొలకలపల్లి రాజ్‌కిషోర్ తెలిపారు. ఉచిత వాహన సదుపాయం అవసరమైనవారు **92810 89601, 92810 89602, 92810 89603** ఫోన్‌నంబర్లకు సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. లూథర్, బాలసుధాకర్, సురేంద్రబాబు పాల్గొన్నారు.

## సామాజిక ప్రయోజనం కోసమే.. కవిత్వం

- నడిచొచ్చిన దారి' ఆవిష్కరణోత్సవంలో వక్తలు



సామాజిక ప్రయోజనం కోసమే సాహిత్యమని, కవులు కవయిత్రులు ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కవిత్వం రాస్తుండడం సంతోషకరమని వక్తలు అన్నారు. నెల్లూరుకు చెందిన ప్రముఖ కవయిత్రి డా. పాతూరి అన్నపూర్ణ రచించిన "నడిచొచ్చిన దారంతా" కవితా సంపుటి ఆవిష్కరణ ఇటీవల స్థానిక టౌన్‌హాల్లో జరిగింది. ప్రముఖ నవలా రచయిత్రి డా. పెళ్ళకూరు జయప్రద ఆ కవితా సంపుటిని ఆవిష్కరించి కవయిత్రిని అభినందించారు. నెరసం అధ్యక్షులు ఎ. జయప్రకాష్ అధ్యక్షత వహించిన ఈ సభలో ముఖ్యఅతిథి డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాహిత్య ప్రయోజనాన్ని వివరించారు. డా.సుంకర గోపాలయ్య పుస్తక సమీక్ష చేశారు. తొలుత జరిగిన కవి సమ్మేళనంలో ముప్పై మంది దాకా కవులు పాల్గొన్నారు. అనంతరం కవయిత్రి పాతూరు అన్నపూర్ణను నెరసం తరపున ఘనంగా సత్కరించారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు ఏసీ స్టేడియం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న ఉచిత వైద్యశిబిరం నిర్వహించి వాకర్స్‌కు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు. చెన్నై హాస్పిటల్ ఇన్స్పిరేషన్ సెంటర్ అధినేత ఎస్‌వి రమేష్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ వైద్యశిబిరంలో డాక్టర్ పి.శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ స్వర్ణముఖి పాల్గొని సుమారు 300 మంది వాకర్స్‌కు వైద్యపరీక్షలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు తలపనేని హరిబాబు, కార్యదర్శి బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్ అహమ్మద్, వాకర్స్ ఇంటర్నేషనల్ -2022 కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, పత్తిపాటి రమణయ్య, మాగంటి ప్రసాద్, కిలారి శ్రీనివాసులునాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, సోను, శివయ్య, సాయి సుబ్బారావు, నిజాముద్దీన్, కోదండరామయ్య, బాబురావు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 64వ భాగం




శ్రీకృష్ణుడు ధర్మరాజుకి జరాసంధ జన్మ వృత్తాంతం చెపుతాడు. మగధ రాజయిన బృహద్రథుడు అద్భుత పరాక్రమవంతుడు. అతని భార్యలు కాసిరాజ కవల పుత్రికలు. ఎంతకాలానికీ సంతానం కలగకపోతే భార్యలను తీసుకుని అడవుల్లోకి వెళ్లి తపస్సు చేసుకుంటాడు. ఒకసారి, చండకౌశిక ముని ఒక మామిడి చెట్టు కింద తపస్సు చేసుకుంటుంటే, బృహద్రథుడు భార్యలతో ఆతనికి సేవలు చేసి మెప్పు పొందుతాడు. ఆ ముని ఒక మామిడి పండునిచ్చి భార్యలిద్దరు సమానంగా తింటే పిల్లలు పుడతారని అనుగ్రహిస్తాడు. బృహద్రథుడు రాజధానికి వచ్చిన తర్వాత కొన్నాళ్ళకి ఇద్దరు భార్యలు గర్భం దాల్చి, సగం శరీరంతో ఉన్న శిశువులని కంటారు. పిల్లల కోసం ఎదురుచూస్తున్న మహారాజుకెలా చూపెట్టాలి అని భయపడిపోయి, దాసులచేత ఆ రెండు శిశు దేహాలను దూరంగా పారవేయిస్తారు. అక్కడే తిరుగుతున్న జర అనే రాక్షసి అవేవో మాంసఖండాలని తలచి వాటిని ఎత్తి బలంగా దగ్గరచేసి కలపగానే, అవి రెండు కలిసి ఒక మనోహరమయిన పసివాడుగ ఉద్భవిస్తాడు. ఆ పసివాడు భయంకరంగా గొంతెత్తి అరుస్తాడు. ఆ అరుపులు అంతఃపురం వరకు వినపడగానే, బృహద్రథుడు పరుగు పరుగున అక్కడకు చేరగానే, జర మానవస్త్రీలాగ మారిపోయి, జరిగిందంతా రాజుకి చెపుతుంది. బృహద్రథుడు ఎంతో ఆనందించి ఆ పిల్లవాడికి జర సంధించింది కాబట్టి, జరాసంధుడని పేరు పెట్టి, ఏటేటా ప్రజలు ఆమె పేరిట ఉత్సవాలు జరిపించాలని ఆజ్ఞాపిస్తాడు. జరాసంధుడు పెరిగి పెద్దవాడయి శిశుపాల, హంస, ధిభకుల సాయంతో శత్రువులను ఓడించి విర్రవీగుతున్నాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజుకి జరాసంధుని గురించి చెప్పి, అతణ్ణి సంహరించటానికి భీమార్జునలిద్దరిని తనతో పంపమని కోరి, ధర్మరాజు అంగీకారంతో మగధ రాజ్యానికి ప్రయాణమవుతారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




# కేవలం 15 ఏళ్లలోనే.. శ్రీసిటీ అభివృద్ధి అద్భుతం

## - ప్రశంసించిన బ్రిటిష్ డెప్యూటీ హైకమిషనర్



శ్రీసిటీలో కేవలం 15 సంవత్సరాల కాలంలో దేశవిదేశీ పరిశ్రమలెన్నో వచ్చి, శ్రీసిటీ అంతర్జాతీయ స్థాయిలో గొప్ప పేరొందడం అద్భుతమని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్రిటిష్ డెప్యూటి హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ప్రశంసించారు. ఈ నెల 18న ఆయన శ్రీసిటీకి వచ్చారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, అక్కడి మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతి, సుస్థిర అభివృద్ధి గురించి వివరించారు. శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌళిక వసతులు, వ్యాపారానుకూల వాతావరణం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన బ్రిటిష్ డెప్యూటీ హైకమిషనర్, శ్రీసిటీ పారిశ్రామిక అభివృద్ధిని గారెత్ విన్ ఓవెన్ అభినందించారు. మొదటిసారి తాను శ్రీసిటీని సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. కేవలం 15 ఏళ్లలో మంచి పారిశ్రామికవృద్ధి సాధించడంతో పాటు పలు యుకె కంపెనీలు ఇక్కడ ఏర్పాటు కావడం అద్భుతమని ప్రశంసించారు. త్వరలో వివిధ రంగాలకు చెందిన మరిన్ని బ్రిటిష్ కంపెనీలు శ్రీసిటీకి తరలి వస్తాయని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, యునైటెడ్ కింగ్‌డమ్‌కు భారత్ అత్యంత ప్రాధాన్యత కలిగిన మార్కెట్ కావడంతో దేశంలో యుకె 6వ అతిపెద్ద పెట్టుబడిదారుగా మారిందని పేర్కొన్నారు. ఇది మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో దాదాపు 5.3 శాతం అన్నారు. శ్రీసిటీలో విభిన్న రంగాలకు చెందిన 8 ప్రముఖ బ్రిటిష్ కంపెనీలు ఉండడం సంతోషకరమన్నారు. ఈ పర్యటనలో భాగంగా గారెత్ విన్ ఓవెన్ శ్రీసిటీ పరిసరాలతో పాటు, బెర్జిన్ పైప్స్ సపోర్ట్స్ ఇండియా, ఎంఎండి హెవీ మెషినరీ, రోటోలాక్ ఇండియా, ఎంఎస్ఆర్ గార్మెంట్స్, క్యాడ్‌బరీ కంపెనీలను సందర్శించారు. ఈ సందర్భంగా బెర్జిన్ పైప్స్ పరిశ్రమలో 350 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించారు. డెప్యూటీ హైకమిషనర్‌తో పాటు హెడ్ ఆఫ్ ట్రేడ్-ఇన్వెస్ట్‌మెంట్ మిషన్ హెడ్ వరుణ్ మాలి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సమావేశం




ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ ఎస్పీడీ సీ ఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష్‌రావ్ ఈనెల 19న శ్రీసిటీని సందర్శించారు. పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని పరిశ్రమల విద్యుత్ వినియోగంపై సమీక్షించారు. పరిశ్రమల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన విద్యుత్ అంతరాయం, వోల్టేజ్ సమస్యలు, పెరిగిన విద్యుత్ మరియు ట్రూ అప్ చార్జీలు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి సంబంధిత సమస్యలపై చర్చించి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వచ్చినందుకు ఏపీఎస్పీడిసిఎల్ సీఎండీకి శ్రీసిటీ ఎం.డి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీలో మరింత మెరుగైన విద్యుత్ వ్యవస్థను నెలకొల్పే చర్యల్లో భాగంగా పలు సూచనలతో కూడిన వినతిపత్రాన్ని సీఎండీకి ఈ సందర్భంగా శ్రీసిటీ విద్యుత్ విభాగం అందచేసింది. ఈ సమావేశంలో సీజీఎం(ఫైనాన్స్) ధర్మజ్ఞాని, సీజీఎం (ఆపరేషన్స్) గురవయ్య, తిరుపతి సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీసిటీ విద్యుత్ విభాగం హెడ్ డిఎన్ రెడ్డి సమావేశ సమన్వయకర్తగా వ్యవహరించారు.

## పేదూరు సొసైటీ అధ్యక్ష పీఠంపై

# తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి

- మంత్రి కాకాణికి కృతజ్ఞతాపూర్వక సన్మానం



తోటపల్లిగూడూరు మండలంలోని పేదూరు ప్రాథమిక సహకారం సంఘానికి అధ్యక్షులుగా స్థానిక యువ నాయకుడైన తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆమేరకు ప్రభుత్వం నుంచి ఈనెల 16న ఉత్తర్వులు రావడంతో, అందుకు సహకరించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన గౌరవపూర్వకంగా కలసి, దుశ్శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పేదూరు సొసైటీ అధ్యక్షునిగా తనపేరును ప్రతిపాదించిన మంత్రి కాకాణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. సొసైటీ అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని, పాలకమండలికి, రైతులకు అందరికీ అందుబాటులో ఉంటూ తనవంతు సేవలందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైకాపా నాయకులు డి. శ్రీనివాసులురెడ్డి, ఎన్.శివయ్య, బి.సుబ్రహ్మణ్యం, నరుకూరు మాజీ సర్పంచ్ ఆకుల మధు, ఎం.రామచంద్రారెడ్డి, రవి, సొసైటీ సీఈఓ పివి రమణమూర్తి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


# శ్రద్ధాంజలి



జననం : 23.06.1936 నిర్యాణం : 22.07.2020

నిరంతర సేవాతత్పరులు, నిస్వార్థ ప్రజాసేవకులు,
ఎందరికో స్ఫూర్తిప్రదాతలు, మాకు మార్గదర్శకులు

**డా. చిల్లకూరు మోహన్‌రెడ్డి గారు**

పరమపదించి తే. 22.07.2023ది నాటికి
మూడేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ మహనీయుని స్మరించుకుంటూ...

తమ్ముడు - మరదలు
ఆచార్య సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై
తమ్ముని కుమారుడు - కోడలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై
తమ్ముని కుమార్తె - అల్లుడు
శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ
తమ్ముని మనుమలు.. మనుమరాండ్రు
జయేష్ & అస్మిత   కీర్తన లక్ష్మి & తనవ్

## ప్రభుత్వ హైస్కూళ్లకు..

# శ్రీసిటీ జపాన్ పరిశ్రమల చేయూత

### రూ. 2.4 లక్షల విలువచేసే డిస్ప్లే బోర్డుల వితరణ



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, అధునాతన విద్యను అందించేందుకు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ అసోసియేషన్ (ఎస్‌జెసీఏ) వారు శ్రీసిటీ పరిసరాల్లోని ఇరుగుళం, మాదనపాలెం జడ్పీ హైస్కూళ్లకు ఒక్కో స్కూల్‌కు ఒకటి చొప్పున 2.4 లక్షల రూపాయల విలువైన రెండు అధునాతన స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులను ఇటీవల తమ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ అసోసియేషన్ ఛైర్మెన్ అకిరా మత్సుద మాట్లాడుతూ, తరగతిలో పాఠ్యాంశాల బోధనకు స్మార్ట్‌బోర్డ్‌లను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జపనీస్ గ్రూప్ వితరణ పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో తన సంతోషం వ్యక్తం చేశారు. శ్రీసిటీ ఆవిర్భావం నుంచి శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా స్థానిక పరిశ్రమల సహకారంతో పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ స్కూళ్ళ అభివృద్ధికి, మౌళిక వసతుల పెంపుకు తాము పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. విద్యాప్రమాణాల పెంపుకు నిరంతర సహాయసహకారాలు అందచేస్తామన్నారు. ఈ ప్రాంతంలోని ప్రభుత్వ స్కూళ్ల విద్యా వసతుల పెంపుకోసం ఎస్‌జెసీఏ ఇప్పటివరకు 13.50 లక్షల రూపాయలు ఖర్చు చేసిందని, శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీఎస్సార్ నిధులతో ఇప్పటివరకు శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు 23 స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులను అందచేసినట్లు శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ తెలిపారు. క్లిష్టమైన విద్యా అంశాలను విద్యార్థులకు బోధించేందుకు ఈ స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు ఈ బోర్డుల వితరణ పట్ల శ్రీసిటీ వారికి, ఎస్‌జెసీఏ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కికువా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ కొబాయాషి, ఎస్‌జెసీఏ ప్రతినిధులు, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ వారు పాల్గొన్నారు.



## వనదేవత అలంకారంలో

# కన్యకాపరమేశ్వరి

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు, సేవలకు కొదవలేదు. ఆర్యవైశ్యులు అంగ రంగ వైభవంగా అమ్మవారికి అన్నిరకాల పూజలు ఎంతో భక్తితో చేస్తున్నారు. ఇటీవల అమ్మవారిని 'వనదేవత' అలంకారంతో కన్నులపండుగ చేశారు. దాదాపు ఆరువేల కేజీల కూరగాయలు, వెయ్యి కేజీల పండ్లు తీసుకొచ్చి వినూత్నమైన రీతిలో అమ్మ వారిని శోభాయమానంగా అలంకరించారు. పాదర్తి బాలాజీ, పైడా హేమంత్ కుమార్, తన్నీరు కిషోర్‌కుమార్, పబ్బిశెట్టి నందకిషోర్, పసుమర్తి కుమార్ తదితరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, ఆలయ పాలకమండలివారు పర్యవేక్షించారు. భక్తులు సుమారు 12వేల మందికి పైగానే పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు.

# కండలేరు ముంపుబాధితులను ఆదుకోండి

### - - - మంత్రి అంబటికి.. బీజేపీ నేత మిడతల వినతి - - -



కండలేరు జలాశయం ముంపు బాధితులను ఆదుకోవాలని, అక్కడున్న నిరుద్యోగులకు వెంటనే ఉద్యోగ సదుపాయాలు కల్పించాలని బిజెపి 'నమామి గంగే' రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఇటీవల నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును కోరారు. గత ఐదు సంవత్సరాలుగా నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, వరదల సమయంలో సోమశిల జలాశయం బాగా దెబ్బతినిందని, దాని మరమ్మతుల పనులు నిధుల కొరతతో నిలిచిపోయి ఉన్నాయని ఆయన మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు కూడా పూర్తిగా నిలిచిపోయి ఉన్నాయని, జిల్లాలో రైతాంగానికి ప్రాణప్రదమైన ఈ జలాశయాల పనులు సత్వరం పూర్తిచేయించేందుకు తగు సహకారం అందించాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమం లాగా చేపట్టాలని, విద్యార్థి దశ నుండే మొక్కలు నాటే అలవాటు చేసుకోవాలని గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అరవ రాయప్ప విద్యార్థులకు పిలుపునిచ్చారు. గ్రీన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానిక పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు రూరల్‌లోని విద్యావిహార్ హైస్కూల్‌లో ఆయన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు, విశ్రాంత ఉప కార్మిక కమిషనర్ రాచపాలెం రఘు, స్కూల్ కరెస్పాండెంట్ రామ్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.ఎస్.వి.కిరణ్ కుమార్, కె.వి.రమణయ్య పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ప్రారంభమైన జాతీయ రహదారి పనులు



తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలోని పలు జాతీయ రహదారుల పనులను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల తిరుపతిలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి ఎం.పి ఎం.గురుమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తిరుపతి జిల్లాలోని చిల్లకూరు క్రాస్ నుంచి తూర్పు కనుపూరుకు నాలుగులైన్ల రహదారి, తూర్పుకనుపూరు నుంచి కృష్ణపట్నం పోర్టు దక్షిణ గేటు వరకు ఆరులైన్ల రహదారి నిర్మిస్తారన్నారు. కాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు.

# అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

### 2వ పట్టణ సీఐ వెంకటేశ్వరరావు



ప్రజలు తమ ఇళ్ల వద్ద సంచరించే కొత్త వ్యక్తులతో అప్రమత్తంగా వ్యవహరించాలని గూడూరు రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. కొందరు హైటెక్ మోసగాళ్లు ప్రభుత్వ సిబ్బందిగా ప్రజలకు మాయమాటలు చెప్పి ఇళ్లలోకి వచ్చి చోరీలకు, మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ప్రజలలో చైతన్యం కలిగిస్తున్నట్లు ఆయన తెలిపారు. కొత్త వ్యక్తులను ఇళ్లలోకి రానివ్వడం, వ్యక్తిగత సమాచారం తెలుపడం చేయవద్దన్నారు. కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీస్‌వారికి సమాచారం అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

# జగనన్న సురక్ష.. పేదలకు శ్రీరామ రక్ష




సిఎం వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్న సురక్ష' క్యాంప్ ద్వారా అన్ని సేవలు గ్రామంలోనే ఉచితంగా అందించడం ఎంతో శుభపరిణామమని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. అర్హులైన వారందరికీ ప్రజాసంక్షేమ పథకాలు అందే విధంగా చేపట్టే బృహత్తర కార్యక్రమమే జగనన్న సురక్ష అని అన్నారు. ఇటీవల గూడూరు పట్టణంలోని అశోక్‌నగర్, ఇందిరానగర్, దివిపాలెం సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. వైసిపి సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బత్తిన విజయకుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, నరసయ్య, అజీజ్, అల్తాఫ్, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



- ఆర్టీవో ఆదినారాయణ

రోడ్డు ప్రమాదాలు ఎక్కువ శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు వాహనదారులందరూ సహకరించాలని గూడూరు ఆర్టీవో ఆదినారాయణ వెల్లడించారు. గూడూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో ఇటీవల విలేకరులతో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రధానంగా అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ లోడ్ కారణంగా అనేక ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతోందని అన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే.. వారి తల్లిదండ్రులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చిల్లకూరు జాతీయ రహదారి సర్కిల్ వద్ద సిగ్నల్ లైటు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరామని ఆర్టీవో ఆదినారాయణ తెలిపారు.



# చింతవరంలో క్షుద్రపూజల కలకలం

తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం చింతవరంలో క్షుద్ర పూజల కలకలం కొనసాగుతోంది. గ్రామ సమీపంలో రాజులకోట అనే నిర్మానుష్యమైన ప్రాంతంలో క్షుద్రపూజలు జరిగినట్లు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పాటు ఓ పెద్ద గుంత లోడి, అందులో ఏదో పూడ్చిపెట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో స్థానికులు అక్కడ ఏం జరిగిందో తెలుసుకునేందుకు పెద్దఎత్తున తరలివెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు.

## టీడీపీ అధికారంలోకి వస్తే..
# కందుకూరు.. ప్రకాశం జిల్లాలోకే!

వలేటివారిపాలెం సభలో నారా లోకేశ్ హామీ

టీడీపీ అధికారంలోకి వస్తే కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామని, కందుకూరు అభివృద్ధికి అన్నివిధాలా చర్యలు తీసుకుంటామని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. జిల్లాల పునర్విభజనలో నెల్లూరు జిల్లాలో కలిసిన కందుకూరు నియోజకవర్గంలో ఈనెల16న ఆయన 'యువగళం' పాదయాత్రను నిర్వహించారు. కందుకూరు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన వలేటివారిపాలెం సభలో ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కందుకూరును ప్రగతిపథంలో పరుగులు పెట్టిస్తామని హామీలిచ్చిన వైకాపా అధినేత, ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. జగన్ ప్రభుత్వం ఒక కొత్త స్కీమ్‌ను తెచ్చిందంటే దానివెనుక ఒక పెద్ద స్కామ్ ఉంటుందని, ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడం తప్ప జగన్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వస్తే రాళ్ళపాడు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని, ఉమ్మడి ప్రకాశం జిల్లాను గుండెల్లో పెట్టుకుని ప్రగతిబాట పట్టిస్తామని అన్నారు.



తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయించి వేధించినవారిని ఎవరినీ వదిలిపెట్టేది లేదని, వడ్డీతో సహా చెల్లిస్తామని, కష్టకాలంలో జెండా మోసిన కార్యకర్తలను ఏనాటికీ విస్మరించేది లేదని అన్నారు. టీడీపీ నాయకుడు ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు ఇంటూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో ముగిసిన పాదయాత్ర

నారా లోకేశ్ జిల్లాలో చేపట్టిన పాదయాత్ర ఈనెల 16తో ముగిసింది. ఈ పాదయాత్రకు అన్ని ప్రాంతాల్లో భారీఎత్తున కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తరలిరావడంతో పార్టీలో ఉత్సాహం మిన్నుముట్టింది. జిల్లాలో మొత్తం 33 రోజులు, 32 మండలాలు, 300 గ్రామాలమీదుగా సుమారు 486.4 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గంలో మొదలైన పాదయాత్ర, వెంకటగిరి, సూళ్ళూరుపేట, గూడూరు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ, కోవూరు, కావలి, ఉదయగిరి నియోజవర్గాలమీదుగా కొనసాగి చివరిగా కందుకూరు నియోజకవర్గ పర్యటనతో జిల్లాలో పాదయాత్ర ముగిసింది.

## జిల్లా టీబీ అధికారిగా..
# డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి



జిల్లాలోని విడవలూరు మండలం రామతీర్థంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డిని జిల్లా క్షయ నివారణ అధికారిగా నియమించారు. వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆయన ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో పని చేస్తున్న డాక్టర్ వెంకటప్రసాద్‌ను చిత్తూరుకు బదిలీ చేశారు.

# బీసీలు ఐక్యంగా ఉద్యమించాలి



రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలంతా ఐక్యంగా పోరాటం సాగించాలని, సమస్యల సాధనకు ఉద్యమించాలని నవనిర్మాణ బీసీ నాయకుడు తాళ్ళూరు రాము పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల సమన్వయ వేదికలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడిచిపోతున్నా బీసీలకు మాత్రం రాజ్యాధికారం దక్కకపోవడం విచారకరమన్నారు. జాతీయ బీసీ కులగణన మండలి సిఫార్సులు అమలుచేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్‌కు, మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల చిత్రాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ నాయకులు కేసన శంకరరావు, దేవరాల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, వంకి పెంచలయ్య, డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, తన్నీరు కోటయ్య, డాక్టర్ మారం సుధాకర్, కిన్నెర మాలకొండయ్య, కాకు కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణ విద్యార్థులకు
# త్వరలో ప్రతిభా పురస్కారాలు

జిల్లాలో ఇటీవల 10వ తరగతిలో 500 మార్కులు పైన, ఇంటర్‌లో 900 మార్కులు పైగా సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు త్వరలోనే ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని, అందుకోసం దరఖాస్తుల స్వీకరణ తేదీని జులై 25వ తేదీ వరకు పొడిగించామని, విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని నెల్లూరుజిల్లా నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేలూరు రంగారావు, వినుకొండ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను నెల్లూరు నవాబుపేట నరుకూరురోడ్డులో ఉన్న శ్రీ మద్దులూరి వీరరాఘవయ్య నాయీబ్రాహ్మణ కల్యాణమండపం వారికి పంపాలని, దరఖాస్తు ఫారాల కోసం 94404 25241, లేదా 99633 24585 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

## ప్రముఖ కథారచయిత వివినమూర్తికి..
# కావలి 'నా' ఫౌండేషన్ అవార్డు



ప్రముఖ కథా రచయిత వివినమూర్తి సాహితీసేవలను అభినందిస్తూ కావలిలోని 'నా' ఫౌండేషన్ అధినేత లేబాకుల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 16న ఆయనకు 'నా' ఫౌండేషన్ తరపున లిటరరీ అవార్డును బహూకరించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కావలి బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణమండపంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా 'మనసు' ఫౌండేషన్ అధినేత మన్నం వెంకటరాయుడు (ఎంవి రాయుడు) పాల్గొని వివినమూర్తి కథల్లోని విశిష్టతలను వివరించారు. అనంతరం వివినమూర్తి జీవితం–సాహిత్యంపై 'వివేచన' పేరుతో అనేకమంది ప్రముఖులు రచించిన వ్యాసాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు రచయిత, జర్నలిస్టు పొనుగోటి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా, అనేక మంది కవులు, సాహిత్యాభిమానులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, ప్రముఖ రచయిత, బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ తదితరులు ప్రసంగించారు.

# ఉదయగిరిలో ఓటర్ల నమోదుపై సమీక్షా సమావేశం



ఉదయగిరి ఎంపిడిఓ కార్యాలయంలో ఇటీవల జిల్లా డ్వామా పీడీ వెంకట్రావు ఆధ్వర్యంలో ఓటర్ల నమోదుపై మండలాధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. బూత్ స్థాయి అధికారులుగా ఉన్నవారు ప్రతిఒక్కరూ జులై 21 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు మండలంలోని ప్రతిగ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లను నమోదు చేయాలని, సవరణలేమైనా ఉంటే పరిశీలించాలని సూచించారు. అధికారులు సమన్వయంతో, స్థానిక నాయకులతో కూడా మాట్లాడి ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి వివరాలతో ఓటర్ల నమోదును పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉదయగిరి తహశీల్దారు జగదీష్‌బాబు, సీతారామపురం తహశీల్దారు షాజియాతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## టూకీగా...



### జొన్నవాడలో కామాక్షితాయి అమ్మవారికి కుంకుమార్చన

జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో ఇటీవల సామూహిక కుంకుమార్చన పూజలు ఘనంగా జరిగాయి. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగించి, స్వామివారికి–అమ్మవారికి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రికి పెద్ద వెండినంది సేవ చేపట్టారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

### గుండెమడకల విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి

వింజమూరు మండలం గుండెమడకల హైస్కూలులో ఇటీవల 10వ తరగతి ఉత్తీర్ణులైన అయిదుగురు విద్యార్థులు వివి సుజిత్, ఆర్కె వాలి, ఎస్.సుధీర్, జి.శరత్‌కుమార్, ఎస్.విష్ణుప్రియలు ట్రిబుల్ ఐటీకి ఎంపికై నూజివీడు కళాశాలలో సీట్లు సాధించడంతో వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి. ఎంఇఓ మధుసూధన్‌రెడ్డి అభినందించారు.

### నెల్లూరులో 22న న్యాయవాదుల సదస్సు

నెల్లూరులోని టౌన్‌హాలులో ఈనెల 22న న్యాయవాదులకు సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు బార్ అసోసియేషన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

### పెంచలకోనలో నిత్యాన్నదానానికి లక్ష విరాళం

రాపూరు మండలం పెంచలకోనలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి గూడూరుకు చెందిన దంతవైద్యులు మామిళ్ళ ప్రసాద్, శ్రావణి గోవిందకృష్ణలు ఇటీవల లక్షా నూటపదహారు రూపాయలను విరాళంగా సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకునికి ఆ విరాళం అందజేశారు.

### ముంగమూరు ఆదరణ కేంద్రానికి ఇన్వర్టర్ బహుకరణ

బోగోలు మండలం ముంగమూరులో భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉన్న ఆదరణ కేంద్రానికి కావలి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రసూన తనవంతు సేవగా ఇటీవల రూ. 20వేల విలువచేసే ఇన్వర్టర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ఆమెకు కేంద్రం డైరెక్టర్ కె.సింహాద్రిరావు కృతజ్ఞతలు చెప్పారు.

### చెర్లోపల్లిలో.. మహిళ మెడలో సరుడు లాగేశారు

జిల్లాలో ఈమధ్యకాలంలో అలవాటు పడ్డ దుండగుల నేరాలు జాస్తయిపోతున్నాయి. ఇటీవల మనుబోలు మండలంలోని చెర్లోపల్లిలో ఇంటిబయట కుటుంబసభ్యులతో కలసి నిద్రపోతున్న పొన్నూరు సాహితి మెడలో అగంతకులెవరో వచ్చి గొలుసు లాక్కుపోయారు. దాంతో తన మెడ కూడా కోసుకుపోయిందని, పోయిన సరుడు విలువ లక్ష రూపాయల దాకా ఉంటుందని బాధితురాలు లబోదిబోమంటోంది.

### ఆత్మకూరులో క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహారం

ఆత్మకూరు ఆసుపత్రిలోని 69 మంది క్షయవ్యాధిగ్రస్తులకు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ విజిత ఇటీవల పోషకాహారం పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నంతో కలసి అయిదురకాల పోషకాహారాలతో కూడిన కిట్లను వారికి ఇచ్చారు. ఆర్ఎంఓ ఉషాసుందరి, ల్యాబ్–టీబీ సూపర్‌వైజర్‌లు సుధాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### గొల్లపాళెం బాలల ఆశ్రమానికి విరాళం

అల్లూరు మండలం గొల్లపాళెంలో ఉన్న శరత్ అనాథ బాలల ఆశ్రమానికి నెల్లూరులోని జడ్పీ వర్కర్స్ అసోసియేషన్ కోశాధికారి ఉమ్మడిశెట్టి చెంచయ్య–లక్ష్మి దంపతులు ఈనెల 17న 10వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు.

### తెడ్డుపాడులో పేకాటరాయుళ్ల అరెస్ట్

దుత్తలూరు మండలంలోని తెడ్డుపాడు గ్రామ పొలాల్లో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 17న ఎస్ఐ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు వారిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 13,450 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్ళపై కేసు నమోదు చేశారు.

# అధికార, విపక్షాల మధ్య నంబర్లాట

(మొదటి పేజీ తరువాయి)

రెండు వారాల క్రితం మన 'లాయర్'లో కూడా 'కూటమి వికసించేనా' అన్న కథనంలో విశ్లేషించాం.

'ప్రత్యామ్నాయ రాజకీయ, సామాజిక, ఆర్థిక అజెండాను దేశం ముందుంచుతామని' బెంగళూరులో భేటీ అనంతరం విపక్షాలు వాగ్దానం చేశాయి. కూటమిలోని అసంతృప్తులను చల్లార్చడం, ఈ వాగ్దానం చేసినంత సులభం కాదు. విపక్ష కూటమిలోని ప్రధాన పార్టీలన్నింటికీ ఎవరి అజెండా వారికుంది. ఎన్నికలవేళ ఏ పార్టీ ఎటు మొగ్గు చూపుతుందన్నది చాలా ముఖ్యం.

### బీజేపీది సొంత పోరాటమే...!

రాజకీయాల్లో కలయికలు కూటములు సాధారణమే. కానీ, ఇప్పుడు అధికార, విపక్షాల నడుమ ఒక నంబర్లాట నడుస్తోంది. 26 పార్టీలతో మోడీపై యుద్ధభేరీ మోగిస్తామని కాంగ్రెస్ కూటమి, ఏకంగా 38 పార్టీలతో ఎన్నికలకు సమాయత్తమవుతున్నామని బీజేపీ దాని మిత్రపక్షాలు చెప్పుకుంటున్నాయి. ఎవ్వరూ తగ్గడం లేదు. బీజేపీకి పేరుకే 38 పార్టీలు తమ కూటమిలో ఉన్నాయని ప్రకటించుకోవడం తప్ప అందులో 25 పార్టీలకు లోక్‌సభలో ప్రాతినిధ్యమే లేదు. బీజేపీ నిలువునా చీల్చిన షిండే ఆధ్వర్యంలోని శివసేన గ్రూపు తప్ప చెప్పుకోదగ్గ పార్టీ ఒక్కటీ లేదు. బీజేపీ నుంచి విడిపోయిన అకాలీదళ్ తిరిగి బీజేపీ కూటమి వైపు చూడడం లేదు. కాబట్టి, బీజేపీ కూటమిలో ఎన్ని పార్టీలున్నా మోడీ పేరు చెప్పుకుని, అయన ప్రసంగాలతో సొంత పోరాటం చేయడం బీజేపీకి తప్పదు.

### నాయకుడు ఎవరు?

విపక్ష కూటమిలో పేరుకు 26 పార్టీలు. వీటిలో టీఎంసీ, డీఎంకే, జేడీయూ తప్ప మిగతావి పెద్దగా ప్రభావం చూపని పార్టీలు. ఇందులో 10 పార్టీలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదు. ఈ కూటమికి "ఇండియా" అని పేరైతే పెట్టారు గాని, అజెండా ప్రకటించలేదు, త్వరలోనే ప్రకటిస్తామని చెప్తున్నారు. పేరు, అజెండా కంటే కూటమిలోని పార్టీలకు, యాంటీ బీజేపీ వర్గానికి భరోసానిచ్చే నాయకుడిని ప్రకటించడం చాలా ముఖ్యం. కాంగ్రెస్ కూటమిలో ఈ సమస్య ఇప్పుడప్పుడే తేలేలా లేదు.

బీజేపీ చెప్పినా చెప్పకపోయినా ఆ కూటమికి ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్ర మోడీనే. మరి విపక్ష కూటమికి ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరు? రాహుల్‌గాంధీ ప్రధాని అభ్యర్థి అని అధికారికంగా ప్రకటన వస్తే తప్ప రాహుల్‌ని మోడీ పోటీదారుగా అనుకోలేని పరిస్థితులు ఉన్నాయి. మమత బెనర్జీ, నితీష్‌కుమార్, శరద్‌పవార్ తమ పీఎం అభ్యర్థి రాహుల్‌గాంధీ అంటే ఒప్పుకుంటారా? మల్లిఖార్జున ఖర్గేను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్న వర్గం కూడా బలంగానే ఉంది. ఆయన అభ్యర్థిత్వాన్ని కూటమి పార్టీలన్నీ స్వాగతిస్తాయా?

### ఎవరి వ్యూహాలు వారివే...

ఢిల్లీ ఆర్డినెన్స్ మీద బీజేపీపై పోరాటానికి విపక్షాల మద్దతు కోసం మాత్రమే ఆప్ ఈ కూటమిలోకి వస్తోంది తప్ప, ఎన్నికల వేళ ఆ పార్టీ ప్రవర్తన ఎలా ఉంటుందనేది సందేహాస్పదమేనన్నది కూడా రాజకీయవర్గాల అంచనా. అఖిలేష్ యాదవ్ వైఖరి కూడా అనుమానాస్పదమేనన్న విశ్లేషణలు సైతం వినిపిస్తున్నాయి. ఇటీవల కేసీఆర్‌ను కలిసి వెళ్లిన అఖిలేష్ ఎన్నికల సమయానికి ఎలాంటి వ్యూహం అమలు చేస్తాడోనన్న సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది. థాక్రేల బలమే హిందూత్వవాదం. తన తక్షణ రాజకీయ అవసరాల కోసం హిందుత్వాన్ని వదిలేసి కాంగ్రెస్‌తో కలిసి వెళ్లడం ప్రస్తుతానికి ఊహించని పరిణామమే. విపక్ష కూటమి వల్ల యాంటీ బీజేపీ చర్చ జరుగుతుండడంతో లెఫ్ట్ పార్టీలు కాంగ్రెస్ పంచన చేరాయి. కానీ, లెఫ్ట్ సిద్ధాంతాలకు, కాంగ్రెస్ వైఖరికీ పొంతనే ఉండదు.

కేరళలో లెఫ్ట్ వర్సెస్ కాంగ్రెస్, ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్ యాదవ్ వర్సెస్ మాయావతి. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ వర్సెస్ ఆప్. కాశ్మీర్‌లో పీడీపీ వర్సెస్ ఎన్సీ పోరు ఉప్పునిప్పు వ్యవహారమే. మరి లోక్‌సభ ఎన్నికల కోసం ఈ పార్టీలన్నీ ఒకే కూటమిలో చేరితే బీజేపీ వ్యతిరేకంగా ఉమ్మడి అభ్యర్థిని నిలబెడతారా? లేదా ఎంపీ టికెట్లు పంచుకుంటారా? ఉప్పు నిప్పు లాంటి రెండు పార్టీల మధ్య ఎంపీ టికెట్ల పంపకాలకి అవి ఒకే అంటాయా? లేదా పశ్చిమ బెంగాల్, కేరళలో తప్ప మిగతా రాష్ట్రాల్లో మాత్రమే విపక్ష కూటమికి లెఫ్ట్ పార్టీలు మద్దతు ఇస్తాయా? ఇవన్నీ భేతాళ ప్రశ్నలే....!

### విపక్ష కూటమిలోని పార్టీలు

కాంగ్రెస్, టీఎంసీ, జేడీయూ, ఆర్జేడీ, జేఎంఎం, డీఎంకే, ఆప్, శరద్‌పవార్ ఎన్సీపీ, ఉద్ధవ్ శివసేన, జేకేపీడీపీ, సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్, జేకేఎన్సీ, ఎస్పీ, ఎండీఎంకే, కేఎండీకే, వీసీకే, ఆర్ఎస్పీ, ఏఐఎఫ్‌బీ, కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి), ఐయూఎంఎల్, ఎంఎంకే, అప్నాదళ్(కె), ఆర్ఎల్డీ

### బీజేపీ కూటమిలోని పార్టీలు

బీజేపీ, షిండే శివసేన, ఆర్ఎల్జేపీ, అప్నాదళ్(ఎస్), ఎల్జేపీ(ఆర్‌వీ), అజిత్ ఎన్సీపీ, ఏజేఎస్‌యూ, ఎంఎన్ఎఫ్, ఎన్డీపీపీ, ఎన్పీఎఫ్, ఎన్పీఈపీ, ఎస్‌కేఎం, ఆర్ఎల్ఎస్పీ, జనసేన, హిందూస్తానీ అవామీ మోర్చా, ఎన్పీపీ, ఐపీఎఫ్‌టీ (త్రిపుర), బోడో పీపుల్స్ పార్టీ, అసోం గణ పరిషద్, ఎస్‌బీఎస్పీ, ఏఐఏడీఎంకే, ఆర్పీఐ(ఏ), పీఎంకే, టీఎంసీ(ఎం), యూపీపీఎల్, ఎస్ఏడీ(ఎస్), మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ, జేజేపీ, పీజేపీ, ఆర్ఎస్పీ, కేపీపీ, యూడీపీ, ఏఐపీ, నిషద్ పార్టీ, ఏఐఎన్ఆర్సీ, హెచ్ఎల్పీ, కేకేసీ, పుతియా తమిళగం.

### ఎవ్వరికీ పట్టని తెలుగు పార్టీలు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పార్టీలైన వైసీపీ, బీఆర్ఎస్, టీడీపీలు ఏ కూటమిలోనూ లేవు. కేసీఆర్‌ను ఎవ్వరూ నమ్మడం లేదు. టీడీపీకి ఎన్డీయే నుంచి పిలుపు రాలేదు. చంద్రబాబు అనుభవాన్ని, జగన్ సామర్థ్యాన్ని, కేసీఆర్ లొల్లిని ఎవ్వరూ గుర్తించలేదు. మోడీ జనసేనాని పవన్ కళ్యాణ్‌కు ఇచ్చిన విలువను కూడా చంద్రబాబుకు ఇవ్వడం లేదు. వైసీపీ కూడా అధికారిక కూటమిలో లేకపోయినా ఒకరకంగా బీజేపీ భాగస్వామే. విచిత్రంగా 2019 ఎన్నికల్లో చంద్రబాబు కాంగ్రెస్‌తో దోస్తీ చేశారు. ఆ తర్వాత బీజేపీ అనుగ్రహం కోసం చంద్రబాబు ప్రాకులాడుతూనే ఉన్నారు. గతానుభవాల రీత్యా మోడీ ఈరోజుకీ చంద్రబాబును నమ్మడంలేదు. రాబోయే ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కలిసి వైసీపీపై పోరాడతాయన్న మాటలు వినపడుతున్నాయి తప్ప వ్యూహాత్మకంగా ఆ వైపు అడుగులు పడడం లేదు. ఒడిషాలోని బిజూ జనతాదళ్ ఎప్పుడూ తటస్థమే. రాష్ట్రంలో తనకు బీజేపీ ప్రధాన ప్రత్యర్థి. కాంగ్రెస్‌తో కూడా నవీన్ పట్నాయక్ సమానదూరం పాటిస్తారు.

ఇలాంటి తరుణంలో అధికార, విపక్షాల మధ్య నడిచే నంబర్లాట ఎలాంటి ఫలితాలను ఇవ్వబోతోందోనన్న ఆసక్తి అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు రాజకీయాల పట్ల ఆసక్తి వున్న సామాన్య ప్రజలలో కూడా కనిపిస్తోంది...!

చూద్దాం 'తగ్గేదే లే' అంటూ కదన రంగంలో దూకుతున్న మహామహులలో భారతీయ ఓటర్లు ఎవరిని తగ్గిస్తారో...?



# రామ్‌ను గెలిపిద్దాం.. సీఎంకు కానుకగా ఇద్దాం

**మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేయనున్న వైకాపా తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త..రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి, ఆ గెలుపును సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇద్దామని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఇటీవల వెంకటగిరిలోని ఎస్ఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో కార్యకర్తలంతా పార్టీ విజయమే లక్ష్యంగా కృషిచేయాలన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో వైకాపాను ఇబ్బందులకు గురిచేసేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అంటూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్తగా నియమితులైన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని, అందుకు నాయకులు, కార్యకర్తలందరూ ఆయనకు అండదండగా ఉండి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని మంత్రి పెద్దిరెడ్డి సూచించారు.

# చంద్రబాబు డ్రామాలను ఎవరూ నమ్మరు

**- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న**



చంద్రబాబు డ్రామాలను ఎవరూ నమ్మరని, ఆయనతో పాటు పవన్ నాటకాలను కూడా ఎవరూ విశ్వసించరని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 19న ఆయన ఇందుకూరుపేట మండలంలోని రావూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. వైకాపా ప్రజాసంక్షేమం కోరుకుంటోందని, ఎవరెన్ని దుష్ప్రచారాలు చేసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ప్రజలున్నారని ఆయనన్నారు. ఎన్నికలొస్తున్నాయి కదా అని బాబు, పవన్‌లు వాహనాలెక్కి రాష్ట్రాన్ని ఉద్ధరిస్తామంటూ చెప్పుకుంటున్నారని, గత నాలుగేళ్లుగా వీరంతా ఎటుపోయారని ఆయన ప్రశ్నించారు. కోవిడ్ కాలంలో ప్రజలు నానా కష్టాలు పడ్డారని, అప్పుడు వీరంతా ఏమయ్యారని ఆయన అన్నారు. వైకాపాను తిడుతూ తిరగడమే లక్ష్యంగా వీరు విన్యాసాలు చేస్తున్నారని, అయినా వీరిని ప్రజలెవరూ నమ్మరని అన్నారు. జగన సుపరిపాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అబద్దాల ప్రచారానికి దిగుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిఎల్‌డిఏ ఛైర్మెన్ గొల్లపల్లి విజయకుమార్, వైకాపా మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మెన్ గునుపాటి సురేష్‌రెడ్డి, నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, ఉడతా వెంకటశేషయ్య, ముంగర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌కు మానిటర్స్ వితరణ



రెడ్‌క్రాస్ నెల్లూరుజిల్లా శాఖలో ఉన్న రక్తనిధికి సౌత్ ఇండియా కృష్ణ ఆయిల్ అండ్ ఫాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 3 లక్షల రూపాయల విలువైన రెండు బ్లడ్ కలెక్షన్ మానిటర్స్‌ని ఇటీవల విరాళంగా అందచేశారు. రక్తసేకరణ ప్రక్రియలో రక్తం గడ్డ కట్టకుండా ఉండటానికి ఈ పరికరాల వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రక్తనిధి కేంద్రం కన్వీనర్ సిహెచ్ అజయ్ బాబు తెలిపారు. మానిటర్లను బహూకరించిన ఆ కంపెనీ ప్రతినిధులను రెడ్‌క్రాస్ తరఫున ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఫీక్ అహమ్మద్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.






# 26న పడుగుపాడులో.. జాబ్‌మేళా


కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో ఈనెల 26వ తేది ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కోవూరు మండలంలోని పడుగుపాడు (స్టవ్ బీడీ కాలనీ)లో ఉన్న యరబాక కృష్ణారెడ్డి–కౌసల్యమ్మ (కెఆర్ అండ్ కె) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ శాఖ–నెల్లూరు వారి ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగనుంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 14 కంపెనీలలో 1227 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ఆయా కంపెనీ ప్రతినిధుల సమక్షంలో ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 10వ తరగతి నుండి డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటిఐ, పాలిటెక్నిక్ చదివిన నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరై వారి అర్హతను బట్టి వివిధ కంపెనీలలో ఉద్యోగం పొందేందుకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పిస్తోందని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు బయోడేటా, ఆధార్‌కార్డు, ఇతర సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలను తీసుకు రావాలని, వివరాలకు ఫోన్ నంబరు 9966019633కు సంప్రదించాలని కోరారు.

# ఎన్‌బికెఆర్‌లో ఘనంగా 'జ్యోతి దినోత్సవం'



విద్యాదాత, దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలకు శ్రీకారం చుట్టినరోజును కోటమండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలో ప్రతిఏటా జ్యోతి దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఈనెల 15న జరిగిన ఈ దినోత్సవంలో ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, పూరి గుడిసెలో రాత్రిపాఠశాలగా ప్రారంభమైన ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలు నేడు అనేక ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు ఇంజనీరింగ్ కళాశాలగా కూడా వృద్ధి చెందాయని గుర్తుచేశారు. వేలాదిమంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడంతో పాటు, ఉచిత భోజన వసతిని కల్పించి ఎందరో విద్యార్థుల భవితకు బాలకృష్ణారెడ్డి వెలుగుబాటలు పరిచారని, భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి 'పద్మశ్రీ' అవార్డును కూడా బహూకరించిందని తెలిపారు. ఇప్పుడు ఆయన లేకున్నప్పటికీ, ఆయన సంకల్పం విజయవంతమైందని, ప్రత్యేకించి ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల జాతీయస్థాయి విద్యాసంస్థలతో పోటీ పడుతూ విద్యనందించడంలో అగ్రగామిగా ఉంటోందని చెప్పారు. ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలు దినదినాభివృద్ధి చెందుతున్నాయని, అందుకు కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నిరంతరం చేస్తున్న కృషి అపూర్వమని కొనియాడారు.

# ఆంధ్రలో ఆవిరైపోయిన 'స్థానిక సంస్థల స్వపరిపాలన'!




ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ సంస్థల స్వపరిపాలన ఆవిరైపోయింది. దీని స్థానంలో 'ప్రభుత్వ వ్యవస్థీకృత అధికార పాలన' ప్రజల దైనందిన అనుభవంలోకి వచ్చింది. ఈ మార్పు వల్ల కలిగిన లాభ, నష్టాల విషయం ఓ క్షణం అటుంచి, ఈ మార్పు భారత రాజ్యాంగానికి అనుగుణంగా ఉందా... లేదా అనేది చూడవలసి ఉంది.

గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ నాయకుడు బలవంతరాయ్ మెహతా పుణ్యమా అని... గ్రామాల్లో ప్రజలు తమను తామే పరిపాలించుకునే 'కాన్సెప్ట్' ఉనికిలోకి వచ్చింది. కాలక్రమంలో అనేక చేర్పులు, మార్పులకులోనై... పంచాయతీరాజ్ వ్యవస్థగా రూపుదాల్చింది. అయితే, 1992కు ముందు ఈ వ్యవస్థ పనితీరు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరుగా ఉండేది.

దాంతో, 1992లో భారత రాజ్యాంగానికి రెండు సవరణలు చేశారు. ఒకటి 73వ సవరణ. రెండవది 74వ సవరణ.

73వ సవరణ అనేది గ్రామాలలో స్వపరిపాలనకు ఉద్దేశించింది. దీని ప్రకారం పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వమే నిధులు అందచేస్తుంది. మూడంచెలుగా ఈ పంచాయతీరాజ్ వ్యవస్థ ఉండాలి. గ్రామ, మండల (ఎన్ టి రామారావు హయాంలో పంచాయతీ సమితులు మండలాలు అయ్యాయి), జిల్లా స్థాయిలో స్థానిక స్వపరిపాలన జరగాలి అనేది 73వ రాజ్యాంగ సవరణ.

పట్టణాలలో మునిసిపల్ కౌన్సిల్స్ ఏర్పాటుకు సంబంధించినది 74వ సవరణ. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో... రాష్ట్ర ప్రభుత్వ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా గ్రామ, పట్టణ వికాసాన్ని పునరుజ్జీవింపచేయాలనే సంకల్పంతో ఈ రెండు రాజ్యాంగ సవరణలు తీసుకువచ్చారు.

ఈ రెండు సవరణలతో, పంచాయతీరాజ్ వ్యవస్థ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఒకే తీరుగా ఏర్పడింది. ఒక్క ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మణిపూర్, మేఘాలయను మాత్రం ఈ సవరణల నుంచి మినహాయించారు.

1992లో రాజ్యాంగానికి ఈ రెండు సవరణలు చేస్తే, 1993 నుంచి అవి అమలులోకి వచ్చాయి. ఇప్పుడు మనం 2023లో ఉన్నాం. అంటే, పంచాయతీరాజ్ పేరిట... దేశంలో 'స్థానిక స్వపరిపాలన' అమలులోకి వచ్చి 30 ఏళ్ళు అయింది.

ఒక్క ఆంధ్రప్రదేశ్ మినహా, మిగిలిన రాష్ట్రాలలో ఈ రాజ్యాంగ సవరణలు యథాతథంగా అమలు అవుతున్నాయి. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఈ రెండు సవరణలు 73, 74 నిర్వీర్యమయ్యాయి. నిస్తేజమయ్యాయి. రాజ్యాంగ సవరణల వెనుకగల స్ఫూర్తి నీరుగారిపోయింది.

రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థలకు ఎన్నికలు జరగడం లేదా అంటే... గ్రామాలు, పట్టణాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేకంగా రాష్ట్రస్థాయిలో ఓ ఎన్నికల కమిషన్ కూడా ఉంది.

కేంద్రం ఈ స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయడం లేదా అంటే... చేస్తుంది. 14, 15వ ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయతీరాజ్ సంస్థలకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో 1729 కోట్లు కేంద్రం విడుదల చేసింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి 2336 కోట్లు, 1920-21 ఆర్థిక సంవత్సరానికి 2625 కోట్లు, 1921-22 ఆర్థిక సంవత్సరానికి 1938 కోట్ల రూపాయలను కేంద్రం రాష్ట్ర పంచాయతీ రాజ్ సంస్థలకు అని విడుదల చేసింది. అంటే 8660 కోట్ల రూపాయలు అన్నమాట.

ఈ మొత్తంలో తమకు ఏమీ రాలేదని మొత్తం నిధులన్నీ రాష్ట్రప్రభుత్వం తీసేసుకుందని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్... రాష్ట్ర ప్రభుత్వాన్ని అల్లరల్లరి చేసేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌లకు వినతిపత్రాలు సమర్పించేందుకు సర్పంచ్‌లు రెడీ అవుతున్నారు.

ప్రజల నుంచి ఎన్నికైన సర్పంచ్, వార్డ్ మెంబర్స్, మునిసిపల్ కౌన్సిలర్ వ్యవస్థలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేయడమే... ఈ సమస్యలకు ప్రధాన కారణం.

ఆ వ్యవస్థల స్థానంలో గ్రామానికి అయితే 'గ్రామ సచివాలయం', మున్సిపాలిటీలో అయితే 'వార్డ్ సచివాలయం'కు ప్రభుత్వం రూపకల్పన చేసింది. గ్రామ, వార్డు పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణను ఈ గ్రామ/పట్టణ వార్డు సచివాలయాల పరిధిలోకి తీసుకువచ్చారు. ఇందులో ప్రజల నుంచి ఎన్నికైన సర్పంచ్, వార్డు మెంబర్, కౌన్సిలర్‌కు ఎటువంటి ప్రమేయం లేదు. దీనివల్ల అధికారపార్టీకి కలిగే రాజకీయ ప్రయోజనం ఏమిటో అర్థం కావడం లేదు.

ఈ గ్రామ, వార్డు సచివాలయం వ్యవస్థలు రాష్ట్ర ప్రభుత్వ కనుసన్నల్లో పని చేస్తాయి. సర్పంచ్‌లు అయినా ప్రభుత్వ కనుసన్నల్లోనే పని చేయాల్సి ఉంటుంది.

ఈ సచివాలయాలు ఆయా జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పని చేస్తుంటాయి. సర్పంచ్‌లూ అలాగే పని చేయాల్సి ఉంటుంది కదా!

అయినప్పటికీ, ఆ ప్రజాప్రతినిధుల వ్యవస్థను, తాటాకు చాప వేసి... దానిమీద ఓ మూలన ప్రభుత్వం కూర్చోబెట్టేసింది.

మరి, ఏ అధికారాలు, నిధులూ, బాధ్యతలూ లేకుండా తయారైన ఈ పంచాయతీరాజ్ వ్యవస్థలను రద్దు చేయవచ్చు కదా అనే అనుమానం కలగడం సహజం.

ఎందుకంటే, రాష్ట్రంలో 12,918 పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో సర్పంచ్‌కి నెలకు మూడు వేల రూపాయలను గౌరవ భృతిగా ప్రభుతం చెల్లిస్తుంది. అంటే నెలకు నాలుగు కోట్లు కృష్ణార్పణం అన్న మాట. ఏడాదికి దగ్గర దగ్గర 600కోట్ల రూపాయలు. అలాగే, పంచాయతీరాజ్ ఇతర వ్యవస్థలపై చేసే ఖర్చులు సైతం శుద్ధ దండుగ కదా!

ఒక్క కలం పోటుతో (ఇప్పుడు కంప్యూటర్ టైపింగ్‌తో) వీటిని రద్దుచేసి పారేయవచ్చు. కానీ, ఆ వ్యవస్థ లేకపోతే, ఆ వ్యవస్థలకు గడువు ప్రకారం ఎన్నికలు జరగకపోతే రాజ్యాంగం ఒప్పుకోదు.






కేంద్రం నిధులు ఇవ్వదు. మహాత్మాగాంధీ గ్రామీణ నిర్మాణ నిధులు(నరేగా) రూపాయి కూడా రాష్ట్రానికి మంజూరు కాదు. అందుకే, వారూ అజాగళ స్తనాల్లా కొనసాగుతున్నారు. అంతఃపురానికి పరిమితమైన రాజుగారి పెద్ద భార్య లాగా కాలక్షేపం చేస్తున్నారు.

ఇక, ఈ పంచాయతీరాజ్ వ్యవస్థలకు క్రమం తప్పకుండా కేంద్రం బదిలీ చేస్తున్న వేలాది కోట్ల రూపాయల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకున్నదంటూ సర్పంచ్‌లు ఇప్పుడు రోడ్డు ఎక్కుతున్నారు. "మాకు రావలసిన ఎనిమిది వేల కోట్లకు పైబడిన మా డబ్బును మాకు ఇప్పించండి" అంటూ సర్పంచ్‌ల సంఘం వాళ్ళు జిల్లాల ఎస్పీలకు వినతి పత్రాలు ఇస్తున్నారు.

గ్రామ సచివాలయాలు సరిపోవు అన్నట్టుగా... ఇది ఒక పార్శ్వం.

'వాలంటీర్' పేరిట మరో వ్యవస్థను పంచాయతీరాజ్ వ్యవస్థకు ప్రభుత్వం ప్రతిసృష్టి చేసింది.

ప్రతి 50 గృహాలకు ఒక వాలంటీర్‌ను బాధ్యులుగా చేసింది. ఆ 50 గృహాలలోని వారికి పర్యవేక్షకులుగా నియమించింది.

ప్రభుత్వం నుంచి విడుదల అయ్యే ఏ సంక్షేమ పథకం తాలూకు నగదునైనా వీరే ఆ యాభై గృహాలలోని వారిలో అర్హులకు అందచేస్తారు. ఆ గృహాలలోని వారిలో అర్హులు ఎవరో, కాని వారెవరో ఈ వాలంటీర్‌లకు తెలుస్తుంది కదా! దీంతో, ఆ జనం మంచి చెడ్డలపై వీరి కమాండ్ అనిర్వచనీయం అన్నట్టుగా ఉంటుంది పరిస్థితి.

వారి సామాజిక స్థితిగతులు, వారి అమాయకత్వం, నిరక్షరాస్యత, అజ్ఞానం, వారి ఆర్థిక స్థితిగతులు, కష్టసుఖాలు, ఈతిబాధలు ఈ 50 గృహాలలోని వారిని వాలంటీర్లపై మరింతగా ఆధారపడేటట్టు చేయడం సహజం. గ్రామాలలో అయితే, ఈ డిపెండబిలిటీ మరీ కొట్టొచ్చినట్టు కనబడుతుంది కూడా. దాంతో, వారి వద్ద... వాలంటీర్ మినహా ఎంఎల్‌ఏలతో సహా ఎవరి మాటా చెల్లని పరిస్థితి ఏర్పడడం సహజం.

గ్రామం మొత్తానికి బాధ్యత వహించాల్సిన సర్పంచ్ గౌరవ వేతనం నెలకు మూడు వేలు అయితే, కేవలం 50 గృహాలలోని జనం (ఓటర్ల)తో టచ్‌లో ఉండే వాలంటీర్ గౌరవ వేతనం... నెలకు 5 వేల రూపాయలు. ఒక గ్రామంలో రెండు వేల మంది ఓటర్లు ఉన్నారు అనుకుంటే.. ఆ గ్రామ సర్పంచ్‌కి మూడు వేల రూపాయలు నెలకు గౌరవ భృతిగా లభిస్తుంటే, వాలంటీర్లు 20 మందిని నియమించి, అందరికీ కలిపి లక్ష రూపాయలు భృతిని ప్రభుత్వమే చెల్లిస్తోంది.

పోనీ, వాలంటీర్లు ఏమైనా ప్రభుత్వ ఉద్యోగులా... అంటే, కాదు అని చెప్పాలి. వీరికి ప్రభుత్వం ఇచ్చే అయిదు వేల రూపాయలు కూడా నేరుగా ఇవ్వదు. పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు సంబంధిత ఎం.డీ.ఓ బదిలీ చేస్తారు. ఆ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ది 'డబల్ యాక్షన్' రోల్. పంచాయతీకి ఆ అధికారి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. గ్రామ సచివాలయానికి మాత్రం డీ.డీ.ఓ. సచివాలయానికి సూపర్ బాస్.

ఆ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరే ఈ వాలంటీర్‌కు నెలవారీ గౌరవ భృతి అందచేస్తారు.

వాలంటీర్‌లు ప్రభుత్వ ఉద్యోగులా... అంటే కాదు. వారు ప్రభుత్వ ఉద్యోగులు అని ఎక్కడా లేదు. ఓ జీ.ఓ కూడా లేదు. మరి, వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల తాలూకు నగదును లబ్దిదారులకు ఏ విధంగా అందచేస్తారు? వారికి అయిదు వేల గౌరవ భృతి ప్రభుత్వ నిధులు అందచేయడానికి ప్రాతిపదిక ఏమిటి? వంటి ప్రశ్నలు సహజంగానే ఉదయిస్తాయి గానీ, సమాధానాలు లాజికల్‌గా లభించవు. ఎవరికి తోచిన సమాధానాలు వారు ఊహించుకోవచ్చు.

ఇప్పుడు, వీరికితోడు "గృహ సారథి" అనే వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

ఇప్పటికే వాలంటీర్‌గా సేవలు అందిస్తున్న వారి జీవిత భాగస్వామే ఈ గృహ సారథి. అంటే పురుషుడు వాలంటీర్ అయితే, ఆయన భార్య, స్త్రీ వాలంటీర్ అయితే, ఆమె భర్త గృహ సారథిగా వ్యవహరిస్తారు. వారికి గౌరవ భృతి ఏమీ చెల్లిస్తున్నట్టు లేదు. ఇప్పుడు ఆ యాభై గృహాలలోని జనాలను వీరిద్దరూ తమ గ్రిప్‌లోకి తీసుకుంటారు. ఎన్నికల్లో వారి పాత్ర అపరిమితం. ఓటర్ల మనసెరిగి వ్యవహరిస్తారు. వారికి అవసరమైన 'మర్యాదలు' వాలంటీర్లు, గృహ సారథులే చేస్తారు. ఓటర్లను సంతోషపెడతారు. ఓపికలేని వారిని పోలింగ్‌బూత్‌కు తీసుకెళతారు. ఎన్నికల్లో అధికారపక్షానికి అన్నీ తామే అయి వ్యవహరిస్తారు.

ఈ విషయాన్ని నాలుగేళ్ళ క్రితమే తెలుసుకుని ఉండవలసిన జనసేన, టీడీపీలు ఇప్పుడు మేలుకుని రంకెలు వేస్తున్నాయి.

నిజానికి సర్పంచ్, వార్డు మెంబర్ /కౌన్సిలర్‌లలో 90%పైబడి వైసీపీకి చెందిన వారే. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైసీపీ విశ్వరూపానికి దడుచుకున్న తెలుగుదేశం, ఇతర పార్టీలు చేతులు ఎత్తేసిన విషయం తెలిసిందే.

ఈ గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేయడం ఏమాత్రం ఆక్షేపణీయం కాకపోయినప్పటికీ, ఆ వ్యవస్థను గ్రామ పంచాయతీ, మునిసిపల్ పాలకవర్గాల అజమాయిషీలోకి తీసుకొచ్చి ఉన్నట్టయితే... పంచాయతీరాజ్ వ్యవస్థలు ఊహాతీతంగా బలపడి ఉండేవి. 'స్థానిక స్వపరిపాలన' అనే మాట సార్థకం అయ్యేది. అధికారపార్టీ వ్యవస్థ కూడా బాగా బలపడి ఉండేది. రాజ్యాంగం కూడా సంతోషించేది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సైతం స్థానిక సంస్థల స్వపరిపాలన చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయి ఉండేవారు. పంచాయతీరాజ్ వ్యవస్థలను నిర్వీర్యం చేశారనే దుష్కీర్తి మరక ఆయనకు అంటుకోకుండా ఉండేది. కానీ, రాజ్యాంగం ప్రసాదించిన అత్యుత్తమ పంచాయతీరాజ్ స్వయం పాలనావకాశాన్ని క్షణిక రాజకీయ అవసరాల కోసం నిర్వీర్యం చేశారు.

- భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com

# కస్తూరిదేవికి గ్రహణం వీడింది...!



- **జీవీకే రెడ్డి దాతృత్వంతో నవోదయం**
- **బాలికల విద్య కోసం అత్యాధునిక విద్యాలయం**
- **25 కోట్ల రూపాయల విరాళంతో... శరవేగంగా జరుగుతున్న నిర్మాణం**

గత కొన్ని దశాబ్దాలుగా నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాసంస్థలకి పట్టిన గ్రహణం క్రమేణా వీడిపోతోంది. మల్లెతోటలకి, పెళ్లిపీటలకి మాత్రమే పరిమితమైపోయి, ఎలాంటి అభివృద్ధికీ నోచుకోకుండా ఉండిన కస్తూరిదేవి ప్రాంగణం ఇప్పుడు వ్యవస్థాపకుల ఆశయాలకి అనుగుణంగా జిల్లాలోని బాలికల విద్యే ప్రధాన ధ్యేయంగా ప్రజలకి చేరువకాబోతోంది. 100 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న ఈ సంస్థ మనుగడ మరో వెయ్యి సంవత్సరాలు గడచినా చెక్కుచెదరకుండా ఉండే విధంగా కార్యాచరణ రూపొందించుకుని అభివృద్ధి చేయబోతోంది జీవీకే రెడ్డి నాయకత్వంలోని విద్యాలయ కమిటీ. రాష్ట్ర విద్యారంగంలోనే తలమానికంగా ఉండేలా కస్తూరిదేవి విద్యాలయాన్ని తీర్చిదిద్దడానికి ప్రణాళిక తయారుచేసుకుని పనులు ప్రారంభించారు.

### జీవీకే రెడ్డి రాక ముందు.. ఆ తరువాత చరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే....

జీవీకే రెడ్డి రాకముందు కస్తూరిదేవి విద్యాలయ సంస్థ ఒక అనాథ. సంస్థని, సంస్థ ఆస్తులని కాపాడే ఒక కాపలాదారుడిగా మాత్రమే అప్పటి సెక్రటరీ మరియు కరస్పాండెంట్ జే.వీ.రెడ్డి పనిచేసేవారు తప్ప సంస్థ అభివృద్ధి కోసం ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

- మొత్తం 20ఎకరాల స్థలంలో 3 ఎకరాలను 1980వ దశకంలోనే అప్పటి కమిటీ ప్రైవేటు వ్యక్తులకు 99 సంవత్సరాలకి లీజుకు ఇచ్చేసింది.
- సంస్థ ప్రాంగణంలోని మరో 8 ఎకరాలు మల్లెతోటల లీజుదారు అధీనంలో ఉండేవి. మల్లెతోటల లీజుదారులు అక్కడే ఇళ్ళు నిర్మించుకుని తమ పేరుతో కరెంటు కనెక్షను తీసుకుని నివసిస్తుండే వాళ్ళు. అంతేకాకుండా, వారి ఇళ్ళకు ఇంటిపన్నును వాళ్ళే చెల్లించ డంతో పాటు వారి ఓటరు కార్డులలో చిరునామాలను కూడా కస్తూరిదేవి ప్రాంగణాన్నే పొందుపరిచారు.
- గతంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంను మాత్రమే సభలు, సమావేశాలు, పెళ్ళిళ్ల ఇతర శుభకార్యాలకు ఇచ్చేవాళ్ళు.
- ఆ తరువాతి కాలంలో ప్రాంగణంలోని అధిక భాగం ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లి ఏళ్లతరబడి వాళ్ళు అక్కడే తిష్టవేసేలా లిఖితపూర్వక ఒప్పందాలు జరిగాయి.
- దిగువ మధ్యతరగతి బాలికల విద్య కోసం ఏర్పాటు చేసిన కస్తూరి దేవి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల హాజరు శాతం అధికంగా ఉండేది. వారికి తగ్గట్లుగా బోధనా సిబ్బంది (టీచింగ్ స్టాఫ్) ఉండేవాళ్ళు కాదు. ఉన్న కొద్దిమంది టీచర్లకు చాలీచాలని జీతాలు వచ్చేవి.
- కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన బాలికల స్కూల్ భవనం శిథిలా వస్థకు చేరిపోయింది. పాఠశాల గదులు పాడుబడిపోయి అనేక గదులు మూతబడిపోయాయి. భవనం పైఅంతస్తులో మొక్కలు మొలిచి అవి మానులుగా మారి ప్రమాదకరంగా తయారై ఉండేవి.
- బాలికల సౌకర్యం కోసం కనీసం మరుగుదొడ్ల వసతి కూడా ఈ స్కూల్ ప్రాంగణంలో ఉండేది కాదు.
- డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి పేరుతో 1997లో ప్రారంభింపబడిన డిగ్రీ కాలేజీ మూసేసే పరిస్థితికి వచ్చింది.

### జీవీకే రెడ్డి అధ్యక్షులుగా వచ్చిన తరువాత....

అలాంటి పరిస్థితులలో ఆపద్బంధువులా సంస్థల అధ్యక్షుడిగా జీవీకే రెడ్డి బాధ్యతలు చేపట్టారు. "మీరు రావాలి... సంస్థని అభివృద్ధి చేయాలి... ఇది దివంగత డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి కోరిక" అని మేనకూరు గోపాలకృష్ణారెడ్డి చెప్పి ఆహ్వానించడంతో జీవీకే రెడ్డి కస్తూరిదేవి విద్యాలయ కమిటీ అధ్యక్షుడిగా ఉండడానికి మొగ్గు చూపారు.

- జీవీకే రెడ్డి వచ్చీరాగానే సంస్థ అభివృద్ధిపైన దృష్టిపెట్టారు. ముందుగా మల్లెతోటల నిర్వాహకుల అధీనంలో ఉండిన 8 యకరాలను ఖాళీ చేయించారు. అందుకోసం ఆరోజుల్లో ఆయన కొన్ని లక్షల రూపాయలను లీజుదారులకు చెల్లించారు. అక్కడే ఇళ్ళు కట్టుకుని ఇంటి పన్నుల రసీదులతో ఓటరుకార్డులలో చిరునామాలతో శాశ్వతంగా కస్తూరిదేవి ప్రాంగణంలో పాగావేసిన లీజుదారులను అతి కష్టం మీద ఖాళీ చేయించి బయటకు పంపించడంలో జీవీకే రెడ్డి చాలా కష్టపడవలసి వచ్చింది. అదే లక్షలు అప్పట్లో ఆయన హైదరాబాదు రియల్ ఎస్టేటులో పెట్టుబడిగా పెట్టుంటే... ఇప్పుడు అవి కొన్ని కోట్లరూపాయలు అయ్యుండేవి.
- నామమాత్రపు లీజుతో 99 సంవత్సరాలు హక్కు పొందిన లీజుదారులను ఆయన పిలిపించి, వారితో చర్చలు జరిపి లీజు మొత్తాన్ని పెంచేలా చర్యలు తీసుకున్నారు. సంస్థ అభివృద్ధి కోసం "మేము సైతం" అనేలా లీజుదారులను ఒప్పించి, డొనేషన్ల రూపంలో సహకరించడానికి వారిని ఒప్పించారు.
- భవిష్యత్తులో వచ్చే ఏ కమిటీ అయినా ఈ సంస్థ ఆస్తులను ఎవరికీ లీజుకి ఇవ్వడంకానీ, అమ్మడం కానీ చేయకుండా తీర్మానించి పాత బైలాస్‌ని సవరణ చేయించి 2018లో కొత్త బైలాస్‌ని తయారుచేసి రిజిస్టర్ చేయించారు. ఈ సొసైటీ ఆధ్వర్యంలో నడిచే అనుబంధ సంస్థలను నడిపే హక్కు మాత్రమే సొసైటీ కమిటీ సభ్యులకు ఉండేలా నిబంధనలను రూపొందించి చట్టబద్ధం చేశారు.

### అంతర్జాతీయ స్థాయి స్కూలు నిర్మాణం...

ఇప్పుడు తాజాగా 25 కోట్ల రూపాయలతో సామాన్య మధ్య, దిగువ తరగతి బాలికలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి జీవీకే రెడ్డి పునాదులు వేశారు. మూడు అంతస్తులలో 72వేల చదరపు అడుగుల స్కూల్ భవన నిర్మాణాన్ని సంస్థ ప్రాంగణంలో చేపట్టారు. ఇక్కడ హాస్టల్ వసతితో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి నివాస గృహాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. డే-స్కాలర్ల కోసం వాహన సదుపాయాన్ని కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తారు. ఈ బృహత్కార్య క్రమం కోసం ఇప్పటికే 20 కోట్ల రూపాయల మొత్తాన్ని జీవీకే రెడ్డి కస్తూరిదేవి విద్యాలయ కమిటీ ఖాతాలో జమ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1,19,00,000 (ఒక కోటి పంతొమ్మిది లక్షల రూపాయలు) రుసుము కింద 'నుడా'కు చెల్లించి, 'నుడా' నుండి తాత్కాలిక అనుమతులు కూడా పొంది నిర్మాణ కార్యక్రమాన్ని ప్రతిభావంతులైన ఇంజనీర్లు, నిర్మాణ సారథుల పర్యవేక్షణలో సాగిస్తున్నారు. CBSE సిలబస్‌తో నిర్వహించే ఈ పాఠశాల పూర్తిగా సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. భవిష్యత్తులో ఈ పాఠశాలకు అనుబంధంగా ఒక డిగ్రీ కళాశాలను కూడా ప్రారంభించాలన్నది కమిటీ లక్ష్యం.



**అధునాతన సరస్వతి నిలయం - కస్తూరిదేవి చదువుల ఆలయం**

**3 ఎకరాల విస్తీర్ణంలో 63 గదులతో 72 వేల చదరపు అడుగులలో, అత్యాధునిక వసతులతో ఈ అధునాతన సరస్వతి నిలయం నిర్మితమవుతోంది. మొత్తం 3 ఎకరాలలో 54 సెంట్లను భవన నిర్మాణం కోసం వినియోగిస్తున్నారు. మిగిలిన 2.46 ఎకరాలను క్రీడా మైదానం కొరకు కేటాయించారు. మొత్తం 63 గదులలో 36 తరగతి గదులు కాగా, ఒక కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు 8 రూములను మిగిలిన సబ్జెక్టుల ల్యాబ్‌ల కోసం కేటాయిస్తున్నారు. 19 గదులను కార్యాలయం, లైబ్రరి, స్టాఫ్ రూములతో పాటు ఇతర అనేక విభాగాల వినియోగం కోసం ఏర్పాటు చేస్తున్నారు.**

- చాలీచాలని జీతాలతో అలమటిస్తున్న బోధన బోధనేతర సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించే ఏర్పాటుచేశారు. పాత బకాయిలు మొత్తం చెల్లించి వారి ప్రావిడెండ్‌ఫండ్ అరియర్స్ కూడా కట్టేసి క్రమబద్ధం చేశారు.
- విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంతో సంబంధం లేకుండా అదనంగా టీచర్లను నియమింపచేసి జీవీకే రెడ్డే తమ సొంత నిధులతో జీతాలను ఇవ్వడం ప్రారంభించారు.
- సుమారు కోటి రూపాయల తమ సొంత నిధులు వెచ్చించి, స్కూల్ భవనాలను ఆధునీకరించి కొత్త సొబగులు దిద్దారు.
- స్కూలు సిబ్బంది, బాలికల మంచినీటి వసతి కోసం వాటర్ ప్లాంటును నెలకొల్పారు.
- స్కూలు సిబ్బంది, బాలికల కోసం సౌకర్యవంతమైన టాయిలెట్లను నిర్మించారు.
- దశాబ్దాల తరబడి లీజు ఒప్పందాలు చేసుకుని పాతుకుపోయిన కళ్యాణమండపాల లీజుదారులతో చర్చించి వారి లీజుని 5 సంవత్సరాలకి కుదించి, 2024 మార్చి తరువాత వాళ్ళు ఖాళీ చేసేలా ఒప్పించి, వారి వద్ద రిజిస్టర్డ్ ఒప్పందం చేయించారు.
- పూల మండపాల వంటి డెకరేషన్ విడిభాగాలు, ఎయిర్‌కండీషన్ యంత్రాలు పెట్టుకోవడానికి అంటూ కొంతమంది తీసుకున్న గొడౌన్‌లను ఖాళీ చేయించారు.
- సంస్థ కోసం విరాళాలు ఇవ్వదలచిన వారికి టాక్స్ పరిధి నుండి మినహాయింపు వచ్చేలా సొసైటీకి 12-Aతో పాటు 80-G సర్టిఫికెట్ వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ఏదేమైనా... ఇన్నేళ్లకు.. ఇన్నాళ్లకు కస్తూరిదేవికి పట్టిన గ్రహణం వీడబోతోంది. కస్తూరిదేవికి బంగారు భవిష్యత్తు రాబోతోంది. ఇది చూసి ఓర్వలేని కొంతమంది సామాజిక కార్యకర్తలు, చేతిలో కలం ఉన్న కాలం తీరిన పేపర్ సారథులు వాస్తవాలను కప్పిపుచ్చి, పనికట్టుకుని అబద్ధా లను ప్రచారం చేస్తున్నారు. కస్తూరిదేవి అభివృద్ధిని అడ్డుకోవాలని వాళ్ళు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో మతిభ్రమించి ప్రవర్తిస్తున్నారు. వందలమంది చేత ముఖాన 'ఉమ్ము' వేయించుకుని, ఆ ఉమ్ము రుచి బాగా తెలిసిన తోలుమందపు పాత్రికేయుడొకాయన చేతిలో పాత పేపర్ ఉందికదా అని వికృత రాతలను వండి వడ్డిస్తున్నాడు. కస్తూరిదేవిపైన, సంస్థ కమిటీపైన ఎవరెన్ని కట్టుకథలు రాసినా, ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ఇప్పుడు అక్కడ జరుగుతున్న అభివృద్ధే నిజం... ముమ్మాటికీ అదే నిజం...!

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com